
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 26 జూలై 2025






గ్రామస్థులను విచారిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

అన్నీ ఆయనే..!

సుండుపల్లె పంచాయతీ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. అత్త సొమ్ము అల్లుడి దానం అన్నట్లు ప్రభుత్వ సొమ్మును ఓ అధికారి ఇష్టమొచ్చినట్లు స్వాహా చేస్తున్నారు. లక్షల్లో నిధులు డ్రా చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఆయనకు పంచాయతీ సమస్యలు పట్టవు కానీ.. ప్రభుత్వ నిధులను ఎలా కాజేయాలో బాగా తెలుసని గుసగుసలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు జమ చేస్తుంటుంది. దీంతో పాటు ఇంటి పన్ను, నీటి పన్ను, ఇంటి ప్లాన్ అప్రూవల్, మార్కెట్ వేలం, అంగళ్ల బాడుగలతో పంచాయతీలకు ఆదాయం పుష్కలంగా ఉంటుంది. ఈ వచ్చే ఆదాయం గ్రామ పంచాయతీల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే ఆ అధికారి లక్ష్యానికి తూట్లు పొడుస్తూ అవినీతి సొమ్ముతో జేబులు నింపుకుంటున్నారు.





సుండుపల్లె పంచాయతీ కార్యాలయం

సుండుపల్లె, జూలై 25(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె గ్రామ పంచాయతీకి గత కొన్నేళ్లుగా సర్పంచ్‌లు లేకపోవడం అక్కడ పనిచేసిన అధికారుల చేతివాటానికి అడ్డే లేకుండా పోయింది. ఇక్కడ పనిచేసిన ప్రతి అధికారి తనదైన స్థాయిలో జేబులు నింపుకుంటున్నారు. ప్రస్తుతం అక్కడ చెక్కరు.. మేకరుగా బాధ్యతలు కలిగిన ఓ అధికారి ప్రభుత్వ ధనాన్ని లూటీ చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

సుండుపల్లె గ్రామ పంచాయతీకి ఆదాయం పుష్కలంగా ఉండడం ఆయనకు బంగారు బాతులా మారిందని స్పష్టంగా తెలుస్తోంది. 2024 అక్టోబరు నెలలో పంచాయతీ సెక్రటరీ బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఓ మండల అధికారే (బిల్లులు పెట్టడంతో పాటు నిధులు డ్రా చేసే బాధ్యతలు) నిర్వర్తిస్తున్నారు. 2024 అక్టోబరు నుంచి గ్రేడ్-1, గ్రేడ్-3 అధికారులు పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసినా కూడా నిధుల విషయంలో వారికి బాధ్యతలు అప్పగించలేదు. ఆ అవకాశాన్ని ఆ అధికారి బాగా వినియోగించుకున్నారని సమాచారం.

మూడు అడుగుల గోడకు రూ.లక్ష బిల్లు

పంచాయతీ నిధులు ప్రజల అవసరాలకు వినియోగించాలి. కానీ ఓ మండల అధికారి ఆయన స్వలాభానికి వినియోగించుకుంటారనే విమర్శలున్నాయి. దశాబ్దాల కాలం నాటి పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంటోంది. గత ప్రభుత్వంలో నూతన సచివాలయ నిర్మాణాన్ని ప్రారంభించారు. దాదాపు నిర్మాణం పూర్తయిపోయింది. కానీ ఓ అధికారి మాత్రం అనవసరంగా అవసరం లేని చోట మూడు అడుగుల గోడ కట్టి రూ.లక్ష వరకు పంచాయతీ నిధులు డ్రా చేశారని సమాచారం.

శానిటేషన్ పేరు చెప్పుకొని

సుండుపల్లె గ్రామ పంచాయతీ అత్యంత పెద్ద గ్రామ పంచాయతీ. సుమారు నాలుగు వేలకు పైగా ఇండ్లు కలిగిన మండల కేంద్రంలో డ్రైనేజీలు లేవు. వర్షపు నీరు ఇళ్లలోని మురికినీరు ప్రధాన రహదారులపై నిలిచినా పట్టించుకోరు. తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నా నిధులు లేవని దాటవేస్తారు. అయితే వారం రోజుల వ్యవధిలో డీజిల్, శానిటేషన్, స్టేషనరీ పేరుతో రూ.1.71 లక్షలు, బ్లీచింగ్ కోసం రూ.58 వేలు, ఆఫీసు ఖర్చుల కోసం అని రూ.26 వేలు బిల్లులు మార్చారని సమాచారం. అలాగే ఒక నెల పంచాయతీ కార్మికుల జీతాల పేరిట రూ.2.77 లక్షలు నిధులు డ్రా చేశారు. అంతేగాకుండా గత 9 నెలల వ్యవధిలో పెద్ద మొత్తంలో పంచాయతీ నిధుల నుంచి డ్రా చేశారని విమర్శలు ఉన్నాయి.

- లక్షల్లో పంచాయతీ నిధులు డ్రా
- ఇష్టారాజ్యంగా స్వాహా
- ప్రభుత్వ ఖాతాలో జమకాని ఇంటి పన్నులు



రూ.లక్ష బిల్లు పెట్టిన మూడు అడుగుల గోడ

ఇంటి పన్ను ఏమైనట్లు ?

సుమారు 4 వేల పైచిలుకు ఇండ్లు ఉన్న సుండుపల్లె పంచాయతీలో ఇంటి పన్ను ఏమవుతుందో అర్థం కావడం లేదు. ఇంటి పన్ను వసూలు చేసి ఏ రోజుది ఆ రోజు ప్రభుత్వ ఖాతాలోకి జమచేయాలి. కానీ అవి ప్రభుత్వ ఖాతాలోకి చేరడం లేదని తెలుస్తోంది.ఇంటిపన్ను కోసం సుండుపల్లె పంచాయతీ కార్యాలయంలో మూడు పుస్తకాలు వినియోగిస్తున్నట్లు సమాచారం. ఇష్టారాజ్యంగా ఇంటి పన్నులు జారీ చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారని విమర్శలున్నాయి.

17 రోజులుగా రికార్డుల్లో ఎక్కించని ఇంటి పన్ను



9-7-2023, 9-7-2024, 9-7-2025 తేదీలతో ఈ నెలలో ఇంటి పన్నులు జారీ చేశారు. ఒక్కో ఏడాదికి రూ.580 చొప్పున రూ.1740 వసూలు చేశారు. కానీ రికార్డులోకి ఎక్కించలేదు. 8-7-2025వ తేది నుంచి అసలు ఇంటిపన్ను వసూలు చేసినట్లు రికార్డుల్లో కూడా ఎక్కించకపోవడం చూస్తుంటే ఏ స్థాయిలో ఇంటి పన్ను దుర్వినియోగం అవుతుందో స్పష్టంగా తెలుస్తోంది. ఇకనైనా జిల్లా అధికారులు చొరవ చూపి పక్కదారి పడుతున్న ప్రభుత్వ నిధులను కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అన్ని బిల్లులు ఉన్నాయి..

అన్ని బిల్లులు ఉన్నాయి. ఏప్రిల్ నెల పంచాయతీ కార్మికులకు బిల్లులు పెట్టాను. మోటారు రిపేరు చేయించాను. కావాలంటే బిల్లులు చూపిస్తాను.

- సురేశ్‌బాబు, ఈవోపీఆర్‌డీ, డిప్యూటీ ఎంపీడీవో, సుండుపల్లె

నిధుల దుర్వినియోగం జరగలేదు..

నిధులు దుర్వినియోగం జరిగి ఉండదు. గ్రామ పంచాయతీకి నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇంటి పన్ను వాటిలో అయితే జరిగి ఉంటే ఉండొచ్చు. విచారిస్తాము.

- సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె

వందశాతం చెత్త సేకరణ జరగాలి

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ములకలచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో వంద శాతం చెత్తసేకరణ జరగాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. మండలంలోని వేపూరికోటలో శుక్రవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని వ్యర్థపదార్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలోని అన్ని కుటుంబాల నుంచి చెత్త సేకరణ చేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, చెత్త సేకరణకు అవసరమయ్యే గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు లేకుంటే భర్తీ చేసుకోవాలని, గ్రామాల్లో చెత్తసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీవో హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన సమస్య పరిష్కారం

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్ వేదికకు వచ్చిన సమస్యను కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరిష్కరించారు. వేపూరికోట పంచాయతీ ఆర్ఎస్ కొత్తపల్లెకు చెందిన రత్నమ్మ ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని పీజీఆర్ఎస్ వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో కలెక్టర్ శుక్రవారం స్వయంగా గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. సమస్యపై తహసీల్దార్ ప్రదీప్, ప్రజలను అడిగి వివరాలు సేకరించారు. స్థలం ఆర్అండ్‌బీ శాఖకు చెందినదిగా తేల్చి అక్కడికక్కడే సమస్యను పరిష్కరించారు. ఆర్అండ్‌బీ బోర్డు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు ఆదేశించారు.

బంగారు కుటుంబాల అభ్యున్నతికి పాటుపడతాం

- కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), జూలై 25(ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల అభ్యున్నతికి పాటుపడతామని కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌లు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు స్ఫూర్తితో స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలోని పీ4 కార్యక్రమంలో భాగంగా 10 బంగారు కుటుంబాలను కలెక్టర్, మరో 10 బంగారు కుటుంబాలను జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ దత్తత తీసుకొని ఆ బంగారు కుటుంబాలకు మార్గదర్శకాలవ్వాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు ఇతర ప్రజా ప్రతినిధులతో చంద్రబాబు పీ4 కార్యక్రమంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం ఉండకుండా చేసేందుకు పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) కార్యక్రమన్ని ప్రారంభించామని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లుగా పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమం భారతదేశానికే కాకుండా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారభించిన పీ4 కార్యక్రమంలో సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగునున్న 20 శాతం మందిని దత్తత తీసుకొని వారి అభ్యున్నతికి పాటుపడనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శకులను బంగారు కుటుంబాలతో లింక్ చేసి ఆ కుటుంబాలకు మార్గదర్శి చేయూత ఇచ్చి వారి అభ్యున్నతికి పాటుపడేలా చేయాలన్నారు. ఆర్థిక సహాయం చేయలేని వారు పలువిధాలుగా చేయూతనివ్వచ్చన్నారు. ఈ సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, సీపీవో వెంకట్, సీఈవో అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ బస్సులోనే డ్రైవర్ మృతి

- ప్రయాణికులు సురక్షితం

6

ఫీజు రాయితీ గడువు పొడిగింపు

కలికిరి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రీ సర్వే జరిగిన గ్రామాల్లో సంక్లిష్టంగా మారిన జాయింట్ ఎల్‌పీఎంల సమస్య పరిష్కారానికి గతంలో ఫీజు చెల్లింపు తగ్గించడం కోసం డిసెంబరు నెలాఖరు వరకూ గడువు పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇటు రైతులు, అటు సర్వే అధికారులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఒక్కో జాయింట్ ఎల్‌పీఎంను విడగొట్టి జిల్లాలోని 30 మండలాల్లోని 463 రెవెన్యూ గ్రామాలకు గానూ మొదటి విడతలో వైసీపీ ప్రభుత్వంలో 138 రెవెన్యూ గ్రామాల్లో మాత్రం రీ సర్వే పూర్తయింది. గతంలో ఈ జాయింట్ ఎల్‌పీఎంలు విడగొట్టే ప్రయత్నాలు జరిగినా ఎక్కడా సానుకూలత జరగలేదు. మొత్తం మీద ఈ 138 గ్రామాలకు సంబంధించి రీ సర్వే పూర్తి కాగా అందులో మొత్త 39,070 జాయింట్ ఎల్‌పీఎంలు తేలాయి. ఇవి కాకుండా జిల్లాలో ఇంకా సగానికి సగం గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేయాల్సి వుంది. వీటిని పరిష్కరించాలని కోరుతూ గతంలో జరిగిన గ్రామ సభల్లో దాదాపు 17 వేల మంది రైతులు అర్జీలు సమర్పించారు. ఒక్కో జాయింట్ ఎల్‌పీఎం విడగొట్టాలంటే రూ.550లు ప్రభుత్వానికి ఫీజు చెల్లించాల్సి వుంది. కొంత మంది రైతులకు 10 జాయింట్ ఎల్‌పీఎంలు కూడా వుండటంతో ఆ మొత్తం రైతులకు తలకు మించిన భారమైంది.. తప్పు చేసింది ప్రభుత్వం.. దానికి ఇంత మొత్తం ఫీజు తామెందుకు చెల్లించాలనే వాదనలు కూడా రైతుల నుంచి బలంగా వినిపించాయి. సమస్యను పరిశీలించిన కూటమి ప్రభుత్వం రైతులు చెల్లించాల్సిన ఫీజు విషయంలో భారీగా వెసులుబాటు కల్పించింది. ఒక్కో ఎల్‌పీఎం విడగొట్టడానికి రూ.550కి బదులుగా రూ.50లు చెల్లిస్తే చాలని జనవరి 1న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వెసులుబాటు ఆరు నెలలు మాత్రమే ప్రభుత్వం కల్పించింది. ఒక వైపు రీ సర్వే, మరో వైపు ఎల్‌పీఎంల సబ్ డివిజను సాధ్యం కాక సర్వేయర్లు సతమతమయ్యారు. సమస్యను గమనించిన ప్రభుత్వం సబ్ డివిజను ఫీజు రాయితీ గడువున మరో ఆరు నెలలు పొడిగిస్తూ తాజా ఉత్తర్వులు ఇచ్చింది.

రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

- భారత న్యాయవాదుల సంఘం డిమాండ్

రాయచోటిటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థ మరింత పటిష్టంగా పనిచేయడానికి, న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలుచేయాలని భారత న్యాయవాదుల సంఘం అన్నమయ్య, కడప ఉమ్మడి జిల్లాల కమిటీ డిమాండ్ చేసింది. భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం రాయచోటి కోర్టుల మెయిన్ గేటు వద్ద న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ మేరకు అన్నమయ్య, కడప ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ మాట్లాడుతూ కక్షిదారుల పక్షాన కేసును బలంగా వాదించినప్పుడు ప్రతివాదులుగా ఉన్న వారు న్యాయవాదులపై కక్ష పెంచుకొని వివిధ రూపాల్లో దాడులకు తెగబడుతున్నారని, దీన్ని నివారించడానికి ప్రత్యేక చట్టం అవసరమన్నారు.

అనంతరం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సి.సుబ్రమణ్యం మాట్లాడుతూ కోర్టుల్లో మహిళా న్యాయవాదులకు ప్రత్యేక విశ్రాంతి గదులను నిర్మించాలని, న్యాయవాదుల అందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కోర్టుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయమూర్తుల ఖాళీలను, ప్రభుత్వ న్యాయవాదుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ప్రమాదవశాత్తు న్యాయవాదులు చనిపోతే ప్రభుత్వం బార్ కౌన్సిల్ కలిపి ఇప్పటి వరకు ఇస్తున్న రూ.10 లక్షలను రూ.20 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.ఆనంద్‌కుమార్, ఐఏఎల్ కడప ఉమ్మడి జిల్లా నాయకుడు రాజగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగభూషణం, ధనుంజయకుమార్, సీనియర్ న్యాయవాది రాజకుమార్‌రాజు, సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా, బార్ స్పోర్ట్స్ సెక్రటరీ సిద్దయ్య, చిన్నయ్య, హుమయున్‌బాషా, నాగేశ్వర, ఎం.నాగేశ్వరరావు, న్యాయవాదులు బేగ్, శివకుమార్, కె.వరలక్ష్మి, నిరంజన్, ఎంఎస్ జగదీశ్, ఇర్షాద్, హరీశ్, సయ్యద్‌బాషా, భరత్‌రెడ్డి, పవనీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాయచోటి కోర్టు గేటు ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ప్రభుత్వ అనుమతులతోనే క్వారీ నిర్వహణ

- నిర్ధారించిన మైన్స్ అధికారులు

పెద్దతిప్పసముద్రం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికల్లు పంచాయతీ గుడ్డంపల్లె సమీపంలో గత 19 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఇషా గ్రానైట్ క్వారీ ప్రభుత్వ అనుమతులతోనే నిర్వహిస్తున్నట్లు మదనపల్లె డివిజనల్ మైన్స్ అండ్ జువాలజీ ఆఫీసర్ డి.వి.రంగకుమార్ నిర్ధారించారు. ఈ ఇషా గ్రానైట్ క్వారీ వలన గ్రామంలో పాఠశాల భవనాలు, స్థానిక రైతుల పంటపొలాలు, తాగునీరు, గాలి కాలుష్యం అవుతున్నట్లు పులికల్లు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు తలారి ఉత్తన్నతో పాటు ఇదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు క్వారీ అక్రమంగా నిర్వహిస్తున్నారని, నిబంధనలు పాటించడం లేదని, లోకాయుక్తతో పాటుగా జిల్లా కలెక్టర్, డివిజనల్, రెవెన్యూ అధికారులకు 2023వ సంవత్సరంలో ఫిర్యాదు చేశారు. దీంతో లోకాయుక్త ఆదేశాల మేరకు శుక్రవారం మదనపల్లె మైన్స్ అండ్ జువాలజీ ఆఫీసర్ డి.వి. రంగకుమార్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి కరుణాకర్, తహసీల్దార్ శ్రీరాములునాయక్, డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మీనరసయ్య, మండల వ్యవసాయాధికారి ప్రేమలత, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్‌బాబు, అసిస్టెంట్ ఎన్‌రోల్‌మెంటు ఇంజనీర్ సి.అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డితో పాటు స్థానిక ఎస్ఐ హరిహర ప్రసాద్‌లు గ్రానైట్ క్వారీని క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా సర్వేయర్లతో సరి హద్దులను సర్వే చేసి సక్రమంగా ఉన్నట్లు సర్వేయర్లు నిర్ధారించారు. క్వారీకి సమీపంలోనే ఉన్న గుడ్డంపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అధికారులంతా వెళ్లి అక్కడి ఉపాధ్యాయులను, విద్యార్థులను అడగగా వారు తమకు ఎటువంటి ఇబ్బందులు కలగలేదని తెలిపారు. అనంతరం పులికల్లు మెయిన్ రోడ్డు వద్ద గల జడ్పీ ఉన్నత పాఠశాల తరగతి గదులు క్వారీలో పెట్టిన బాంబ్ బ్లాస్ట్ వల్ల నెర్రెలు బారాయని ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులతో కలిసి అక్కడి విద్యార్థులను అడిగారు. మైన్స్ అధికారులు, సర్వేయర్లు క్షుణ్ణంగా సర్వే చేసి నివేదికను సంబంధిత లోకాయుక్తకు పంపించనున్నట్లు పేర్కొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మైన్స్ అధికారులు

నకిలీ పట్టాల ముఠా అరెస్ట్

- 13 మందిపై కేసు నమోదు
- 10 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు
- నకిలీ పత్రాలు, అనుబంధ ఫారాలు, పాసుబుక్కులు స్వాధీనం
- డీఎస్పీ రాజేంద్రప్రసాద్



నకిలీ పట్టాల తయారీ ముఠాను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

బద్వేలుటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): బద్వేలులో నకిలీపట్టాల కేసుపై డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో విచారణ చేపట్టి 13మందిపై కేసు నమోదు చేయగా, శుక్రవారం 10మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నకిలీపట్టాలు, అనుబంధ ఫారాలు, పాసుబుక్కులు, రెవెన్యూ అధికారుల సీళ్లు, రబ్బరుస్టాంపు మిషన్, ప్రింటర్లను స్వాధీనం చేసుకుని నిందితులను బద్వేలు పోలీస్‌స్టేషన్ ఆవరణలో హాజరుపరిచారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గోపవరం మండలం నుంచి ఒక పట్టాపై ఫిర్యాదు రావడంతో దానిని తహశీల్దార్‌కు పంపగా, వారు పరిశీలించి నకిలీది తేల్చారన్నారు. ఈ పట్టాకు సంబంధించి దాసరి రత్నమ్మ అనే మహిళను విచారించడంతో నకిలీపట్టాలు తయారుచేసిన పిల్లి భాస్కర్, రవిశంకర్, బాబూరావు, చిన్నసుబ్బయ్య పేర్లు వెలుగులోకి వచ్చాయన్నారు. వీరిని విచారించడంతో రామాంజుల ఓబులేసు అలియాస్ కుమార్ అనే వీఆర్వో ద్వారా నకిలీ పట్టాలు తయారుచేసి ఇస్తున్నారనే విషయం తేలిందన్నారు. వీరు కడప నగరానికి చెందిన బాబూ ప్రింటర్స్ యజమాని షేక్‌బాబ్‌జాన్ వద్ద సీళ్లు, రబ్బరు స్టాంపులు తయారు చేయించుకొని అందరూ ఒక ముఠాగా ఏర్పడి నకిలీ పత్రాలు, ధ్రువీకరణ పత్రాలు, అనుబంధ పత్రాలు, పాస్‌బుక్కులను తయారుచేసి విక్రయదారులకు ఇచ్చేవారన్నారు. ఈ నేపథ్యంలో ప్రసాద్, జయపాల్ ఇద్దరూ నకిలీ పట్టాలు తెచ్చి రత్నమ్మకు ఇచ్చారన్నారు. ఆమె వాటిని ఐదారుగురికి విక్రయించిందని దీంతో వారంతా గొడవ పడి ఆ సమస్య పోలీస్‌స్టేషన్‌కు చేరగా, దీని ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు.

వీటిని స్వాధీనం చేసుకున్నారు

నకిలీ పట్టాలు తయారుచేసే ముఠా నుంచి రెవెన్యూ కార్యాలయాల సీళ్లు 46, వ్యవసాయ డి.నమూనా పత్రాలు 96, డీకేటీ పట్టాలు 280, అనుబంధ పత్రాలు 28, పట్టాదారు పాసుబుక్కులు 70, పొసెషన్ సర్టిఫికెట్లు 35, వ్యవసాయ భూమి అప్పగింత పట్టాలు 22, వైట్‌నర్ 1, ఇంక్‌పాడ్ 5, గ్రీన్‌ఇంకు పెన్నులు 4, స్టాప్‌నర్ 1, గమ్ బాటిళ్లు 2, ప్రింటర్ 1, రబ్బరుస్టాంపు తయారుచేసే మిషన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నకిలీ ముఠాను చాకచక్యంగా పట్టుకున్న సీఐ రాజగోపాల్, ఎస్ఐలు సత్యనారాయణ, జయరామిరెడ్డి,సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అరెస్టు అయింది వీరే: నకిలీ పట్టాల తయారీ ముఠా కేసులో 10 మందిని అరెస్టు చేశామన్నారు.. మార్తోమనగర్‌కు చెందిన దాసరి రత్నమ్మ, పొట్టిప్రసాద్, జయపాల్, సుమిత్రానగర్ వాసి రామాంజుల ఓబులేసు అలియాస్ కుమార్, బయనపల్లెకు చెందిన పిల్లి భాస్కర్, బేతాయపల్లె వాసి మన్యం బాబూరావు, సుమిత్రనగర్‌కు చెందిన రవిశంకర్, గూడెం గ్రామానికి చెందిన కాడి చిన్నసుబ్బయ్య, కడపలోని బాబూ ప్రింటర్స్ యజమాని షేక్‌బాబ్‌జాన్, కాశినాయన మండలం రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన అన్నపురెడ్డి శ్రీనివాసులను అరెస్ట్ చేశామని డీఎస్పీ అన్నారు. మరికొంత మందిని విచారణ చేపట్టి త్వరలోనే వీరిని కూడా అరెస్టు చేస్తామన్నారు.

భోజనం పెట్టేదెలా..?

6

- వసతి గృహ అధికారులపై మెనూ భారం
- మానసిక ఒత్తిడిలో హెచ్‌డబ్ల్యూవోలు
- వైసీపీ అనాలోచిత చర్యలు.. బీసీ వసతి గృహాలకు శాపాలు



బంగారు కుటుంబాలను గుర్తించాలి



'పీ-4'పై అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన 'పీ-4' విధానంతో బంగారు కుటుంబాలను గుర్తించాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలిసి ఇతర అధికారులు సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జీరో పావర్టీ కింద ప్రభుత్వం చేపట్టిన 'పీ-4' విధానంలో గ్రామాలు, పట్టణాల్లో బంగారు కుటుంబాలను గుర్తించాలన్నారు. ఆర్థిక స్థోమత వున్న వారిని గుర్తించి వారి సహాయంతో నిరుపేదలను వారికి తోచిన విధంగా ఆర్థికంగా ఆదుకునేలా సహకారం కోరాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సాధికారత కోసం సీఎం చంద్రబాబు 'పీ4' ప్రారంభించారని, అధికారులు కూడా బాధ్యతగా పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీఓలు తాజ్‌మస్రూర్, రమేశ్‌బాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలపై కేసు నమోదు

పీలేరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహా మరికొందరు వైసీపీ నేతలపై పీలేరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసు యాక్టు 30 అమలులో ఉన్నప్పుడు పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ బుధవారం పీలేరులోని డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. దీంతో పోలీసులు అందులో పాల్గొన్న చింతల రామచంద్రారెడ్డి, పీలేరు మండల వైసీపీ అధ్యక్షుడు దండు జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ కంభం సతీశ్ రెడ్డి, జడ్పీటీసీ రత్నశేఖరరెడ్డి, సర్పంచ్ హబీబ్ బాషా, నాయకులు ఉదయ, షాకీర్, మునీర్, గాయం భాస్కరరెడ్డితో పాటు మరికొందరిపై కేసు (నెం.181/2025) నమోదు చేశారు.

ఆటోను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

గుర్రంకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆటోను కారు అతివేగంగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం సూరప్పగారి పల్లె వద్ద జరిగింది. రామాపురం మండలం గువ్వలచెరువుకు చెందిన సలీమ్, జాకీర్ ఆటోలో పాలఖవ్వ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో భాగంగా వీరు ఆటోలో గుర్రంకొండకు వస్తుండగా మండలంలోని సూరప్పగారిపల్లె వద్ద మదనపల్లె నుంచి రాయచోటికి వెళుతున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న సలీమ్, జాకీర్‌కు గాయాలయ్యాయి. బాధితులను రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు.

'భూములు దురాక్రమణ కానివ్వద్దు'



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

తంబళ్లపల్లె, జూలై 25(ఆంధ్రజ్యోతి): జుంజురపెంట పంచాయతీ నేరేడు కొండపై వెలసిన నేరేడు కొండ్రాయ స్వామి ఆలయ భూములు దురాక్రమణ కాకుండా కాపాడాలని మూడు గ్రామాల ప్రజలు తహసీల్దారు శ్రీనివాసులును కోరారు. శుక్రవారం జుంజురపెంట, ఆర్ఎన్ తండా, కొట్టాల గ్రామాల ప్రజలు, నేరేడు కొండయ్యస్వామి ఇలకాపులు బండారి నాగరాజ ఆధ్వర్యంలో తహసీల్దారును కలిసి వినతిపత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ దాదాపు 700 ఏళ్ల కిందటి నుంచి పూజలందుకుంటున్న నేరేడు కొండ్రాయస్వామి ఆలయానికి తంబళ్లపల్లె మండలంలోని జుంజురపెంట, ములకలచెరువు మండలంలోని కాలువపల్లె పంచాయతీల్లో మాన్యం భూములు ఉన్నాయన్నారు. బురుజుపల్లెకు చెందిన కొందరు నేరేడు కొండ్రాయస్వామి ఆలయం పేరుతో దాతల నుంచి డబ్బు వసూలు చేశారని, ఇప్పుడు మాన్యం భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జుంజురపెంట నేరేడు కొండపై ఉన్న నేరేడు కొండ్రాయస్వామి ఆలయానికి, బురుజు పల్లెలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి గుడికి ఎటువంటి సంబంధం లేదన్నారు. అధికారులు స్పందించి ఆలయ భూములు దురాక్రమణ కాకుండా చూడాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, నేరేడు కొండయ్యస్వామి ఇలకాపులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

రామాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టోల్‌గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెందాడు. స్థానికుల, పోలీసుల వివరాల మేరకు... పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కడప నుంచి పుంగనూరుకు వెళుతుండగా మార్గమధ్యలో టోల్‌గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఆ వ్యక్తి దుర్మరణం చెందాడు. కాగా బస్సు డ్రైవర్ రాయచోటి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అదుపులో ఉన్నట్లు సమాచారం.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భోజనం పెట్టేదెలా..?

- వసతి గృహ అధికారులపై మెనూ భారం
- మెనూలో సవరణలకు తావులేని జీవో 8
- మానసిక ఒత్తిడిలో హెచ్‌డబ్ల్యూవోలు
- వైసీపీ అనాలోచిత చర్యలు.. బీసీ వసతిగృహాలకు శాపాలు



సంబేపల్లె, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయలేక అధికారులు సతమతమవుతున్నారు. గతంలో ధరలకు అనుగుణంగా మెనూ చేర్పులు, మార్పులకు వీలుగా ప్రిన్సిపల్ సెక్రటరీ జీవో విడుదల చేసేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2022లో ప్రభుత్వం క్యాబినెట్‌లో ధరలు లేని మెనూతో జీవో నెంబర్ 8 అమలు చేసింది. దీంతో వసతి గృహ అధికారులపై భారం పడుతోంది.

మార్కెట్‌లో ప్రతి వస్తువుకు ధర ఉంది. ధర లేకుండా మెనూ పెట్టడం ఒక్క వైసీపీ ప్రభుత్వానికే చెల్లింది. బియ్యం, కందిబేడలు, ఆయిల్, చింతపండు, కోడిగుడ్డు, అరటిపండు, గోధుమపిండితో పాటు వివిధ రకాలతో మెనూ కోసం ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ఒక్క రోజుకు రూ.46 కేటాయించింది. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరల ప్రకార ఒక్కో విద్యార్థికి సరాసరి రోజుకు రూ.59 ఖర్చవుతోంది. దీంతో ఒక్క విద్యార్థిపై ఒక రోజుకు రూ.13 అదనపు భారం పడుతున్నట్లు వసతి గృహ అధికారులు (హెచ్‌డబ్ల్యువో) లబోదిబోమంటున్నారు. ధరలను బట్టి మెనూ మార్చే అధికారం ఆయా జిల్లాల కలెక్టర్లకు ఉంటే మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం క్యాబినెట్‌లో జీవో నెంబర్ 8 పెట్టడంతో కలెక్టర్లకు కూడా మెనూ మార్చే అధికారం లేదు. దీంతో వైసీపీ అనాలోచిత చర్య వసతి గృహ అధికారులకు శాపంగా మారిందని చెప్పవచ్చు.

ఎఫ్ఆర్ఎస్‌లో సాంకేతిక లోపంతో..

బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యారుల హాజరు కోసం ప్రభుత్వం ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) పద్ధతిని ప్రవేశపెట్టింది. విద్యార్థుల హాజరు ముఖం ఆధారంగా నమోదు చేస్తారు. అయితే ఎఫ్ఆర్ఎస్ సిస్టంలో సాంకేతిక లోపాలతో ఒక్కోరోజు కొంతమంది విద్యార్థుల హాజరు నమోదు కావడంలేదు. దీంతో హెచ్‌డబ్ల్యూవోలపై అదనపు భారం పడుతుంది. కేవలం బీసీ వసతి గృహాల్లో మాత్రమే ఈ విధానం ప్రవేశపెట్టారు. వసతి గృహ అధికారులు సెలవులో ఉన్నప్పుడు ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టం హాజరును నమోదు చేసేందుకు అవకాశం లేదు. ట్యాబులు, సెల్‌ఫోన్లను ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో కూడా నష్టపోతున్నట్లు చెబుతున్నారు.

స్కావెంజర్స్ నియామకాల్లేవు

సంక్షేమ వసతి గృహాల్లో పరిశుభ్రతను పాటించాలని ఒక పక్క చెబుతున్నా ఆ దిశగా నిబంధనలు పాటించడం లేదని చెప్పవచ్చు. బాత్‌రూంలు, మరుగుదొడ్లు శుభ్రతకు ఫినాయిల్ ఇవ్వరు. యాసిడ్ ఉండదు. వీటిని శుభ్రపరిచేందుకు స్కావెంజర్స్ నియామకం జరపడం లేదు. దీంతో హాస్టళ్ల పరిశుభ్రత కూడా వసతి గృహ అధికారులపై అదనపు భారం పడుతోందని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీ హాస్టళ్ల పరిశుభ్రతకు స్కావెంజర్స్ నియామకం చేపట్టాలని కోరుతున్నారు.



బీసీ వసతి గృహ విద్యార్థులకు రోజు వారీ మెనూ

ఒత్తిడిలో హెచ్‌డబ్ల్యూవోలు

సంక్షేమ వసతి గృహాల నిర్వహణ అమలులో హెచ్‌డబ్ల్యూవోలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్పవచ్చు. ప్రభుత్వం పెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలంటే అదనపు భారం తప్పడం లేదు. ఇక వసతి గృహ నిర్వహణ బాధ్యతలు భారంగా మారుతున్నాయి. దీంతో మానసిక ఒత్తిడికి గురై ఆందోళనతో చనిపోతున్నారు. వారం క్రితం బాపట్ల జిల్లా అద్దంకి హెచ్‌డబ్ల్యువో మరణించారు. 2022లో వైసీపీ ప్రభుత్వం వసతి గృహాల్లో మెనూ కోసం జారీ చేసిన జీవో నెంబర్ 8ని రద్దు చేసి ఆయా జిల్లాల్లో స్థానికంగా ధరలకు అనుగుణంగా మెనూలో మార్పులు, చేర్పులు చేసే అధికారం జిల్లా కలెక్టర్లకు ఇవ్వాలని హెచ్‌డబ్ల్యూవోలు కోరుతున్నారు. లేదంటే వసతిగృహాల్లో విద్యార్థులకు భోజనం పెట్టడం తలకు మించిన భారమేనని వాపోతున్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ బస్సులోనే డ్రైవర్ మృతి

- ప్రయాణికులు క్షేమం



రోడ్డుపక్కన ఆగిని ఆర్టీసీ బస్సు, రసూల్ మృతదేహాన్ని బయటికి తీస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాయచోటిటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో కావలి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ రసూల్ (55) గుండెపోటుతో బస్సులోనే మృతి చెందగా.. బస్సులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. పోలీసులు, ప్రయాణికుల కథనం మేరకు.. కావలి డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు గురువారం బెంగళూరుకు బయలుదేరింది. మార్గమధ్యంలోని రాయచోటి బస్టాండుకు తెల్లవారుజామున వచ్చింది. అనతరం బెంగళూరుకు బయలుదేరగా మదనపల్లె రోడ్డులోకి రాగానే డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో ఆయన పక్కకు ఒరిగిపోయాడు. దీంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు వచ్చి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సీట్‌లోనే మృతిచెందగా అందులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్ రసూల్ మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ గుండెపోటుతో మృతిచెందడంతో బస్సు అదుపు తప్పిందా... లేక ఆయన నిద్రమత్తులో ఉండటంతో అదుపు తప్పిందా అనేది పోస్టుమార్టంలో తెలుస్తుందని ట్రాఫిక్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

కలెక్టర్ చొరవతో విద్యార్థినికి కృత్రిమ చెయ్యి



నవోదయ విద్యార్థినికి కృత్రిమ చెయ్యి అమర్చిన వైద్యులు

మదనపల్లె అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వలసపల్లె పంచాయతీ జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థిని శివానీకి శుక్రవారం తిరుపతి రిమ్స్‌లో కృత్రిమ చెయ్యిని ఏర్పాటు చేసినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గీత పేర్కొ న్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పుట్టుకతోనే ఒక చెయ్యి లేకుండా పుట్టిందని, సొంత పనులు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్న శివానీ విషయం కలెక్టర్ శ్రీధర్‌కు తెలియజే శామన్నారు. కలెక్టర్ చొరవతో తిరుపతిలోని రిమ్స్ ఉపసంచాలకులు ఆర్వీ కృష్ణకిషోర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్ఓ శ్రీకాంత్ పర్య వేక్షణలో ఆర్థోటిక్స్ డాక్టర్ జగదీష్ శివానీకి కృత్రిమ చెయ్యిని అమర్చారు. దివ్యాంగు రాలైన శివానీ ఎడమ చేతితోనే 2023 గుజరాత్‌లోను, 2024 బెంగళూరులో నిర్వ హించిన పారా జాతీయ క్రీడల్లో జావలిన్ త్రో, షాట్‌పుట్‌లో రెండేళ్లు బంగారు పతకాలు సాధించారన్నారు. 2023లో థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ పారా స్పోర్ట్స్‌లో జావలిన్ త్రో, షాట్‌పుట్‌లో రెండు బంగారు పతకాలను, 2024లో థాయ్‌లాండ్‌లో నిర్వ హించిన అంతర్జాతీయ పారా స్పోర్ట్స్‌లో షాట్ పుట్‌లో బంగారు పతకాల పంట పండించిందని ప్రిన్సిపాల్ వివరించారు. శివానికి కృత్రిమ చెయ్యి అమర్చడంతో మరెన్నో బంగారు పతకాలను సాధిస్తోందని ప్రిన్సిపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. తన పనులు తాను చేసుకోవడానికి కృత్రిమ చెయ్యిని ఏర్పాటు చేయించిన కలెక్టర్ శ్రీధర్‌కు శివాని కృతజ్ఞతలు తెలిపారు.

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి: డిప్యూటీ సీఈఓ

పీలేరురూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణంపై పంచాయతీ అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఈఓ వెంకట నారాయణ ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం పీలేరు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో సుమారు 60 వేలు పైచిలుకు జనాభా ఉన్నారని, అయితే ఇంత వరకూ పట్టణంలో ఎక్కడా పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడమేమిటని ప్రశ్నించారు. పట్టణంలో అనువైన ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులతో సంప్రదించి టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ లతీఫ్‌ఖాన్‌ను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ జీ. శివశంకర్, ఏఓ రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర పాల్గొన్నారు.

'కళాకారుల పాత బకాయిలు చెల్లించాలి'

పీలేరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కళాకారులకు అందాల్సిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, అనంతపు రం జిల్లాల కళాకారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజయవా డలోని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు పెంచలయ్యను కలిసి వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడుతూ 2018-19 ఆర్థిక సంవత్సరంలో జరిగిన జన్మభూమి-మన ఊరు, గ్రామదర్శిని కార్యక్రమాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన కళాకారులకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పట్లో రాష్ట్రంలో ఉన్న 13 ఉమ్మడి జిల్లాల్లోని ఆరు జిల్లాల కళాకారులకు బకాయిలు చెల్లించారని, ఆ తరువాత వాటి గురించి ఎవరూ పట్టించుకోలేదన్నారు. కళలనే నమ్ముకున్న కళాకారులకు ప్రభుత్వ కార్యక్రమాల్లో కళాప్రదర్శనలు ప్రదర్శించి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల సమన్వయకర్తలు ప్రవీణ్, తరిమిళ్ల రాజు టింగ్ టింగ్ వెంకటేశ్, కళాబృందాల నాయకులు ఖాదర్‌బాషా, కలకట రెడ్డప్ప, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక శాఖ రాష్ట్ర సహాయ సంచాలకుడు పెంచలయ్యతో కళాబృందాల నేతలు

రాజమండ్రి నుంచి డిప్యూటీ సర్వేయర్ అన్నమయ్యకు బదిలీ

కలికిరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి నుంచి డిప్యూటీ సర్వేయర్ కె.సుస్మితను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. భార్యాభర్తల కేటగిరీ కింద తనను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేయాలని ఆమె చేసుకున్న దరఖాస్తుపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుని బదిలీ ఆదేశాలు జారీ చేసింది. జోన్ మొత్తం మీద 15 శాతం మించి నాన్‌లోకల్ లేకుండా చూసుకోవాలని, జిల్లాలో సీనియారిటీ జాబితాలో స్థానిక ఉద్యోగుల తరువాత నమోదు కావాలనే నిబంధనలు విధిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎర్రచందనం కేసుల కోర్టు ఎస్‌పీపీగా అమరనారాయణ

మదనపల్లెటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల విచారణ కోర్టు (తిరుపతి) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మదనపల్లె వాసి న్యాయవాది ఎ.అమరనారాయణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఎస్‌పీపీగా విధుల్లో చేరిన రోజు నుంచి మూడేళ్లు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆయనకు గౌరవ వేతనంగా ప్రభుత్వం నెలకు రూ.40 వేలు చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

- డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు

రాయచోటిటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని రాయచోటి డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి డైట్ కేంద్రంలో రెండు సంవత్సరాల డీఈఎల్ఈడీ కోర్సు ప్రారంభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి విచ్చేసిన ఉపాధ్యాయ శిక్షణ పొందగోరే ఛాత్రోపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. డైట్ లాంటి ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో పనిచేయడం గౌరవ ప్రదమైన విషయమన్నారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్లు శివభాస్కర్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, ఉషారాణి, నూతన ఛాత్రోపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శుక్రవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రాల మధ్య భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలను నిర్వహించారు. రాహుకాల పూజల విశిష్టత గురించి అర్చకులు మహిళా భక్తులకు వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆక్రమణలపై చర్యలేవి

- తూతూమంత్రంగా మరోసారి నోటీసులు
- పూర్తయిన ఇంటి నిర్మాణం



శుక్రవారం మూడోసారి నోటీసులు అందజేస్తున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

సుండుపల్లె, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇంటి అక్రమ నిర్మాణంపై చర్యలు మృగ్యమయ్యాయి. అక్రమ నిర్మాణాన్ని శుక్రవారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ సురేశ్ బాబు, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, సిబ్బంది పరిశీలించారు. గత వారం రోజుల నుంచి నోటీసులు మీద నోటీసులు ఇచ్చినా అక్రమ ఇంటి నిర్మాణం ఆగలేదు. గురువారం రాత్రి మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీ చీనేవాండ్లపల్లెకు చెందిన ఓ వ్యక్తి స్లాబ్ పూర్తి చేశారు. బేస్‌మట్టం నిర్మాణం నుంచి కలెక్టర్, సుండుపల్లె మండల రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. సాక్షాత్తు జిల్లా, నియోజకవర్గ అధికారులే నిర్మాణం ఆపాలని చెప్పినా ఆగలేదు. ఐదు రోజుల క్రితం డీపీవో మస్తాన్‌వలి అక్రమ నిర్మాణం దీనిపై చర్యలు తీసుకుంటామని పల్లెకు వెళ్లి మరీ హెచ్చరించారు. గతంలో రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. అయినా నిర్మాణదారులు తగ్గనేలేదు. గురువారం మరోమారు అధికారులు నిర్మాణం ఆపకపోతే కేసు పెడతామని హెచ్చరించి వచ్చారు. అదేరోజు రాత్రి స్లాబ్ పూర్తి చేయడం ఆశ్చర్యంగా ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. మండలంలో అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో ఈ సంఘటనతో అర్థమవుతుంది. అయితే శుక్రవారం ఎంపీడీవో వెళ్లి ఇకపై కట్టవద్దని చెప్పి వచ్చానని పేర్కొన్నారు. ఉన్నది దొంగ పట్టా, దాన్ని రెవెన్యూ అధికారులు జారీ చేయలేదు. రికార్డుల్లో లేదని తేల్చిన నిర్మాణాన్ని పూర్తి చేయడంపై అధికారులు ఆపలేకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇకపై నిర్మాణం చేపడితే చర్యలు తప్పవు

- ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

ఇంటి నిర్మాణం విషయంలో ఇకపై పనులు చేపడితే కఠిన చర్యలు తప్పవు. ఈ విషయాన్ని డీపీవో దృష్టికి తీసుకెళతాం.

బొప్పాయి లారీలను అడ్డుకున్న రైతులు



బొప్పాయి కోతలను అడ్డుకున్న రైతులు

చిట్వేలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దళారుల రాజ్యంతో బొప్పాయి రైతులు కుదేల వుతున్నారు. ధరల తగ్గింపుతో కడుపు మండిన రైతులు చిట్వేలి మండలంలో గురువారం రోడ్డెక్కారు. అందులో భాగంగా శుక్రవారం రైతులు తమకు గిట్టుబాటు ధర ఇచ్చేవరకు బొప్పాయి కోయనివ్వమని లారీలను అడ్డుకున్నారు. మండలంలోని ప్రతి పల్లె తిరుగుతూ బొప్పాయ కటింగ్‌ను అడ్డుకున్నారు.

అప్పుల ఊబిలో బొప్పాయి రైతులు

బొప్పాయి సాగు చేస్తున్న రైతన్నకు అప్పులే మిగులుతున్నాయి. దీనికితోడు అతివృష్టి, అనావృష్టి వల్ల రైతాంగం అప్పుల ఊబిలో పడిపోయింది. నకిలీ విత్తనాలు, ఎరువులతో రైతులు కుదేలవుతున్నారు. ఎకరా పొలంలో బొప్పాయ సాగు చేస్తే నకిలీ విత్తనాలు, నకిలీ నారుతో సగం దిగుబడి కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను నట్టేట ముంచుతున్నారు.

దళారుల మాయాజాలం

బొప్పాయి రైతులపై దళారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. గురువారం రోడ్డెక్కిన రైతులు తమకు గిట్టుబాటు ధర కల్పించే వరకు కాయలు కోసేది లేదని తెగేసి చెబుతున్నా వినడం లేదు. కోతలను అడ్డుకున్న రైతులపై దళారులు వాగ్వాదానికి దిగారు. తమకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం జరిగే వరకు కాయలు కోయనివ్వమని రైతులు దళారులను హెచ్చరించారు.

అభివృద్ధి వైపు..
డీసీఎంఎస్ అడుగులు!



కడప నగరంలోని డీసీఎంఎస్ భవనం

గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో నష్టాల్లో కూరుకుపోయి, ఆర్థిక సమస్యలతో ఇంతకాలం సతమతమైన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) క్రమంగా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వంలో నియమితుడైన పీఐసీ కమిటీ ఛైర్మన్ జయప్రకాశ్ నేతృత్వంలో వ్యాపార విస్తరణకు సన్నద్ధమవుతోంది. సొసైటీ ఏర్పడినప్పటి నుంచి రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు సరఫరా చేసే బాధ్యతను నిర్వహిస్తోంది. వైసీపీ హయాంలో ఆ బాధ్యతలను రైతు భరోసా కేంద్రాలకు అప్పజెప్పడంతో.. డీసీఎంఎస్ మనుగడ కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. అప్పుడప్పుడూ ఇతర వ్యాపారాలు చేస్తున్నా.. ప్రైవేటు వ్యాపారులతో పోటీకి తట్టుకోలేక ఇబ్బందులు పడింది. ఈ నేపథ్యంలో సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీలు, గదులు, స్థలాలపై అద్దెల ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఐదేళ్ల కాలంలో సుమారు రూ.6 కోట్ల మేర నష్టాలను మూటగట్టుకుంది.

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియమించిన డీసీఎంఎస్ నూతన కమిటీ వ్యాపార విస్తరణకు సన్నాహాలు చేస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రసాయనిక ఎరువులు, పురుగు మందులు విక్రయించేందుకు ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేయనుంది. మైదుకూరు ప్రాంతంలో ఉద్యానపంటలతో పాటు వరి ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. ఈ ప్రాంతంలో ఉద్యాన పంటలకు అవసరమైన పురుగు మందులతో పాటు, యూరియా తదితర రసాయనిక ఎరువులను విక్రయించి లబ్ధి పొందాలనే ఆలోచనలో ఉంది. పులివెందుల ప్రాంతంలో చీనీ, అరటిలాంటి పంటలు అధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి. ఆ ప్రాంతానికి సంబంధించిన రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, టార్పాలిన్లు తదితరాలు ,మామిడి, బొప్పాయి పంటలు ఎక్కువగా సాగయ్యే రైల్వేకోడూరు ప్రాంతంలోఎరువులు, పురుగు మందులతో పాటు, వ్యవసాయ పరికరాలు విక్రయించాలని కమిటీ ప్రణాళికలు రూపొందిస్తోంది. గతంలో రాజంపేటలో ఏర్పాటు చేసిన బనానా రైపెనింగ్ చాంబర్‌ను కూడా పరిశీలించి, పరిస్థితులు అనుకూలిస్తే దానిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు యోచిస్తోంది. ఈ విధంగా ఆయా ఏరియాలకు సంబంధించి ఏఏ పంటలు సాగవుతాయి, ఎంత మేర ఎరువుల వ్యాపారం ఉంటుంది. దాని వల్ల ఎంత కమిషన్లు పొందవచ్చనే దానిపై కమిటీ ఛైర్మన్ జయప్రకాశ్ అధికారులతో చర్చిస్తున్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులతో ఆయన సుదీర్ఘంగా చర్చించి ఆయా కార్యాలయాలకు అవసరమైన స్టేషనరీ, ఇతర పరికరాలు సరఫరాల బాధ్యత డీసీఎంఎస్‌కు అప్పగించే విధంగా సహకరించాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు శాఖల అధిపతులతో చర్చించారు.

ఆదాయం అభివృద్ధికి చర్యలు



నష్టాలబారిన పడిన డీసీఎంఎస్‌ను అభివృద్ధి బాటలోకి తీసుకువచ్చేందుకు జిల్లా అధికారులతో పాటు రైతులు, సిబ్బంది సహకారంతో చర్యలు తీసుకుంటున్నాం. కడప నగరంలోని చెమ్ముమియ్యాపేట వద్ద ఉన్న స్థలం గతంలో తక్కువ మొత్తానికి లీజుకు ఇచ్చారు. దీనిని పునః పరిశీలించి లీజు మొత్తాన్ని పెంచే అంశాన్ని కూడా ఆలోచిస్తున్నాం.

- వై.జయప్రకాశ్, ఛైర్మన్, డీసీఎంఎస్ కమిటీ

స్థలాలు, భవనాల అద్దెలపై దృష్టి

డీసీఎంఎస్‌కు ఉన్న ఖాళీ స్థలాలు, భవనాల అద్దెల ద్వారా మరితం ఆదాయం పొందే విషయంపై పీఐసీ కమిటీ దృష్టి సారించింది. ఇప్పటికే ఖాళీ స్థలాలను లీజు ప్రాతిపదికన పొందిన వ్యాపారుల నుంచి అద్దె వసూళ్లపై దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా కడప నగరంలోని చెమ్ముమియ్యాపేట వద్ద గతంలో అతి తక్కువ ధరకు స్థలాలను లీజుకు ఇచ్చారనే విషయాన్ని పరిశీలిస్తోంది. భవిష్యత్తులో లీజు మొత్తాన్ని పెంచేందుకు యోచిస్తోంది. కడప నగరంలోని మట్టి పెద్దపులి వద్ద నిరుపయోగంగా ఉన్న గోదాముకు మరమ్మతులు చేయించి అద్దెకిచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. నగర నడి బొడ్డులో ఉన్న డీసీఎంఎస్ కార్యాలయానికి చెందిన ఖాళీ స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టి రెంట్‌కు ఇవ్వడం ద్వారా మరింత ఆదాయం పొందాలనే యోచనలో కమిటీ ఛైర్మన్ ఉన్నారు. సొసైటీ ఏర్పడినప్పటి నుంచి టీడీపీకి చెందిన వ్యక్తులు ఎవరూ సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించలేదు. ఇప్పుడు మాత్రమే టీడీపీకి చెందిన జయప్రకాశ్‌కు పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ ఛైర్మన్‌గా అవకాశం ఇవ్వడంతో, నష్టాల్లో ఉన్న డీసీఎంఎస్‌ను లాభాల బాటలోకి తీసుకువచ్చి తమ సమర్థతను నిరూపించుకునేందుకు శ్రమిస్తున్నారు.

పాలకవర్గానికి సహకరిస్తాం



డీసీఎంఎస్ అభివృద్ధి కోసం పాలకవర్గానికి సహకరిస్తాం. సొసైటీ బాగుపడితే అటు రైతులకు కానీ, ఇటు సిబ్బందికి కానీ ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు కూడా డీసీఎంఎస్ వినిమయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా అధికారులు తమకు అవసరమైన స్టేషనరీ ఇతర పరికరాల సరఫరాకు మాకు అవకాశం కల్పించాలి.

- ఎస్.ఖాదర్‌వలి, బిజినెస్ మేనేజరు, డీసీఎంఎస్

మెట్రో రైలు నిర్మాణ వ్యయం కేంద్రమే భరించాలి

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ, విజయవాడల్లో మెట్రో రైలు నిర్మాణ వ్యయాన్ని కేంద్రమే భరించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. విభజన చట్టం ప్రకారం మెట్రో రైలు సౌకర్యాన్ని విభజన జరిగిన సంవత్సరం లోపు కేంద్ర నిధులతో కల్పించాల్సి ఉండగా 50:50 ప్రాతిపదికన కేంద్రం, రాష్ట్రం భరించేటట్లు టెండర్లు పిలవాలని గురువారం రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించడం శోచనీయమన్నారు. దీంతో రాష్ట్ర ఖజానాపై విపరీతమైన ఆర్థిక భారం పడుతుందన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి 49,485 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని, వెంటనే 80, 515 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.6400 కోట్లను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పది వారాలుగా ఉపాధి హామీ కూలీలకు వేతనాలు అందలేదని, ఇందుకు సంబంధించి నిధులు వెంటనే విడుదలచేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.మండలానికి ఒక సెంట్రలైజ్‌డ్ కిచెన్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధి కోల్పోతారని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి రైతులో మార్పు రావాలి

● జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్



శిక్షణలో పాల్గొన్న రైతులు

లింగాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సాగు విధానంలో సమూల మార్పులు చేపట్టాల్సిన సమయం వచ్చిదని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని అక్కులగారిపల్లెలో ప్రకృతి వ్యవసాయం చేసే ఉదయ్‌కృష్ణారెడ్డి పొలంలో రైతు సేవ కేంద్రం సిబ్బందికి శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విపరీతంగా రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగిస్తుండడంతో ఆహారం విషతుల్యం అవుతోందని, భూసారం తగ్గిపోయి, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు క్రమంగా ప్రకృతి వ్యవసాయం చేసేలా వారికి అవగాహన కల్పించాలని, ప్రస్తుత వ్యవసాయం విధానాల వలన కలిగే దుష్ప్రభావాలు, ప్రకృతి వ్యవసాయం వలన కలిగే ప్రయోజనాలను వివరించి వారిలో మార్పు కలిగేలా రైతు సేవా కేంద్రం సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల, వేముల ఏఓలు చెన్నారెడ్డి, ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

మీరు భయపెడితే భయపడతామా..

● నాకేమైనా జరిగితే మీ కుటుంబాలకు నిద్రలేని రాత్రులే..

● నారా లోకేశ్, బీటెక్ రవిపై వైసీపీ నేత సతీష్‌రెడ్డి ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న సతీశ్ రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె,జూలై 25 (ఆంధ్రజ్యోతి): నీవు భయపెడితే భయపడతామా.. నాకేమైనా జరిగితే నీ కుటుంబానికి నిద్రలేని రాత్రులు ఉంటాయని మంత్రి లోకేశ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిపై వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం కడపలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను చంద్రబాబునాయుడు, లోకేశ్‌పై విమర్శలు చేశానని వారు చెప్పడమే కాకుండా, తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించడం శోచనీయమన్నారు. మీ నాయకుల కోసం తొందరపడి మాట్లాడొద్దని సూచించారు. మాట్లాడేటపుడు సంస్కారం తో మాట్లాడితే మంచిదని హితవుపలికారు. తనకు, శ్రీనివాస్‌రెడ్డి, బీటెక్ రవి మధ్య ఎటువంటి విభేదాలు లేవని, లోకేశ్ రెచ్చగొట్టడం వల్లే వారు ఇలా మాట్లాడుతున్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, మేయర్ సురేశ్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధి పొంది.. విమర్శించడం సిగ్గుచేటు!

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, భూపేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో పదవులు పొందిన సతీశ్ రెడ్డి , ప్రస్తుతం ఆయననే విమర్శించడం సిగ్గుచేటని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఆగస్టు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలనకు శుక్రవారం జమ్మలమడుగుకు వచ్చిన ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష నేతలు కొత్త బిక్షగాళ్ల పొద్దెరగరన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. 20 నుంచి 30 ఏళ్ల టీడీపీలో రాజకీయ లబ్ధిపొందిన తర్వాత వైసీపీలో చేరినవారు చేస్తున్న విమర్శలు పత్రికల్లో చూస్తున్నామన్నారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసి గట్టిగా బుద్ధి చెప్పినా ఇప్పటికి వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు ప్రజలు నమ్మడంలేదన్నారు. సంపద సృష్టికోసం రాష్ట్రానికి అనేక సంస్థలు రాబోతున్నాయన్నారు. ఈ సారి తామే అధికారంలోకి వస్తామని వైసీపీ నాయకులు చెబుతుండడంతో పారిశ్రామిక వేత్తలు భయపడుతున్నారన్నారు. సతీష్‌రెడ్డి వైసీపీ భజన చేయడం దారుణమన్నారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్ల అధికారంలో ఉండి, అన్ని రకాలుగా లబ్ధిపొందిన కడపజిల్లాలో పులివెందుల సతీష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఏం అభివృద్ధి చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక 300 నుంచి 400 మందికి సోలార్ విద్యుత్ సంస్థలో ఉద్యోగాలు ఇప్పించామన్నారు. జమ్మలమడుగులో రూ.25 కోట్లతో సీసీ రోడ్లు వేయించామన్నారు. 2019లో చంద్రబాబునాయుడు భూములు కోటాయించి మరీ సోలార్ ప్రాజెక్టులను తెస్తే.. వారిని బెదిరించారన్నారు. ఇద్దరూ టీడీపీలో లబ్ధిపొంది వైసీపీలో చేరి చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేస్తున్నారన్నారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆ ఇద్దరూ బాధితులే అన్నారు. అన్ని రకాలుగా ఇబ్బందులు పడి తిరిగి ఆయన కుమారుడు జగన్ చెంత చేరి రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబును విమర్శించడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. జమ్మలమడుగులో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్మీడియట్ బోర్డు ఆర్జేడీగా సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌ఆర్జేడీగా సురేష్‌బాబును నియమిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా వృత్తి విద్య అధికారిగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబుకు కడప ఆర్జేడీ (ఎఫ్ఏసీ)గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. కడప ఆర్జేడీగా విధులు నిర్వహించిన శ్రీనివాసులు జూన్ 30న పదవీ విరమణ చేశారు. నేడో, రేపో సురేష్‌బాబు బాధ్యతలను స్వీకరించనున్నారు.

కేజీబీవీల్లో జీసీడీవో తనిఖీలు

కడప ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాపాడు, జమ్మలమడుగు, పెద్దముడియం కేజీబీవీలను జీసీడీఓ రూతు ఆరోగ్యమేరీ శుక్రవారం సందర్శించారు. డార్మెటరీ, మరుగుదొడ్లు, కిచెన్, స్టోర్ రూమ్, క్లాస్‌రూమ్‌లను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన కృత్యాలు, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఏంజెల్ ప్రణీత, నాగలక్షుమ్మ, మౌనిక, సిబ్బందికి తెలిపారు.

లైంగిక వేధింపుల కేసులో డీఎస్పీ విచారణ

దువ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగికంగా వేధించిన కేసులో మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. స్థానికులను, బాధితురాలిని కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఎస్ఐ వినోద్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం విరిగిపడి గొర్రెలు మృతి

మైదుకూరు రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి) విద్యుత్ స్తంభం విరిగిపడి ఆరు గొర్రెలు మృతి చెందినట్లు విద్యుత్ శాఖ ఏఈ వీరభద్రయ్య తెలిపారు. మైదుకూరు మండలంలోని సోమయాజులపల్లె గ్రామ పరి.ధిలో పెనుగాలులకు కరెంటు స్తంభం విరిగి పక్కనే అదే గ్రామానికి చెందిన సిద్దం రుక్మిణమ్మ అనే మహిళకు చెందిన గొర్రెలపై పడడంతో 6 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రమాదంతో తమకు సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయింది.

భరత్‌యాదవ్‌పై హత్యాయత్నం కేసు

పులివెందుల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తుపాకీతో పట్టపగలు ఓ వ్యక్తిని కాల్చిచంపిన భరత్‌యాదవ్ హతుడి తల్లిపైనా దాడి చేయడంతో హత్యాయత్నం కేసు నమోదైందని పులివెందుల సీఐ చాంద్ బాషా తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. 2023లో పులివెందుల నడిబొడ్డున బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన తుపాకీతో దిలీప్‌కుమార్ అనే వ్యక్తిని భరత్‌యాదవ్ కాల్చి చంపాడు. ఈ హత్య కేసు ప్రస్తుతం రాజీ చేసుకునేందుకు కొన్ని రోజులుగా భరత్‌యాదవ్ ప్రయత్నిస్తున్నాడు. గురువారం దిలీప్‌కుమార్ ఇంటివద్దకు పెద్ద మనుషులను పంపి రాజీ చేసుకునేందుకు ప్రయత్నించాడు. అందుకు దిలీప్‌కుమార్ తల్లి మస్తానమ్మ ఒప్పుకోలేదు. దీంతో శుక్రవారం ఉదయం 6.15గంటల ప్రాంతంలో భరత్‌యాదవ్ వారింటికి వెళ్లి ఈ కేసులో రాజీకి రాకుంటే చంపేస్తానంటూ మస్తానమ్మను బెదిరించాడు. రాజీకి మస్తానమ్మ ఒప్పుకోకపోవడంతో.. ఆమెను జుట్టుపట్టుకొని ఈడ్చి కొట్టాడు. దీనిపై మస్తానమ్మ పోలీసులను ఆశ్రయించడంతో భరత్‌యాదవ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శశిభూషణ్‌రెడ్డి

దువ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి వెల్లడించారు. దువ్వూరులో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్ శనివారం కడప పర్యటనకు వస్తున్నారని అన్నారు. బీజేపీ బలోపేతానికి మొదటగా రాయలసీమ జిల్లాలోని కడపను ఎంపిక చేసి పర్యటన చేపడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ, జాతీయ రహదారుల అభివృద్ధి, కడప-రేణిగుంట రైల్వే అభివృద్ధి, మైదుకూరు మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం, కడప విమానాశ్రయ అభివృద్ధి లాంటివాటికి నిధులు కేటాయించారని చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరికృష్ణ, ధార్మికసెల్ జిల్లా కన్వీనర్ బాస్కర్‌రెడ్డి, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, ప్రతాప్, పాల్గొన్నారు.

శిశువుల్లో జన్యు రుగ్మతలకు
ఉచిత స్క్రీనింగ్

కడప సెవెన్ రోడ్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జనన దశలో, గర్భధారణ సమయంలో శిశువుల్లో జన్యుపరమైన రుగ్మతలను నిర్ధారించేందుకు రిమ్స్‌లో ఉచిత స్క్రీనింగ్ అందుబాటులోకి వచ్చిందని సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. భారత ప్రభుత్వ బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ), న్యూఢిల్లీ అందించే ఉమ్మీద్ అవుట్‌రీచ్ ప్రాజెక్ట్ కడప ప్రభుత్వ వైద్యశాలకు లభించిందన్నారు. మన రాష్ట్రంలో కడప జిల్లా మాత్రమే ఈ ప్రాజెక్టు కింద ఎంపికైందన్నారు. ఇది మూడు సంవత్సరాల పాటు నిధులందించే ప్రాజెక్టు అని ఇందులో 30,000 మంది గర్భిణిలకు హిమోగ్లోబినోపతీ కోసం, 15,000 నూతన శిశువులకు జన్యుపరమైన మెటబాలిక్ రుగ్మతల కోసం ఉచితంగా స్క్రీనింగ్ చేస్తారన్నారు. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం జన్యు, మెటబాలిక్ రుత్మతలను తొందరగా గుర్తించి చికిత్స అందించడమని తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ సేవలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రియుడి మోసానికి యువతి బలి!



ప్రశాంతి (ఫైల్ ఫొటో)

కుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాకు చెందిన ఓ యువతి ప్రియుడి మోసానికి బలైపోయింది. ప్రియుడి ఇంటి ముందే శరీరం మీద పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. చిత్తూరు జిల్లా కుప్పంలో గురువారం రాత్రి పొద్దుపోయాక జరిగిన ఈ విషాదం సంచలనం సృష్టించింది. డీఎస్పీ పార్థసారథి కథనం మేరకు... కుప్పం మండలం మార్వాడ గ్రామానికి చెందిన వాసు గతంలో కడపలో నివాసముంటూ మైదుకూరులోని ఓ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేసేవాడు. అప్పటికే అతడికి స్వగ్రామంలో భార్య, ఒక కుమారుడు ఉన్నారు. అదే సమయంలో కడపకు చెందిన కేజీవీ ప్రశాంతి (24) ప్రొద్దుటూరులోని ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీ విభాగంలో పనిచేసేది. వీరిద్దరికీ పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. అయితే తనకు వివాహమైన విషయం వాసు దాచిపెట్టాడు. ఏడాదినుంచి తనను పెళ్లి చేసుకోవాల్సిందిగా వాసును ప్రశాంతి ఒత్తిడి చేయసాగింది. దీంతో వాసు చెప్పాపెట్టకుండా స్వగ్రామమైన మార్వాడకు వచ్చేశాడు. ఈ నేపథ్యంలో ఎలాగో వాసు చిరునామా తెలుసుకున్న ప్రశాంతి, ఈనెల 23న మార్వాడకు వచ్చి తనను పెళ్లి చేసుకోవాలంటూ అతడిపై ఒత్తిడి తెచ్చింది. వాసు కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ఆమె తల్లి అయిన మాలతిని కడపనుంచి పిలిపించి సర్దిచెప్పి తల్లితోపాటు పంపించేశారు. అయితే ప్రశాంతి గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో తిరిగి మార్వాడ చేరుకుంది. వాసు ఇంటి ఆవరణలోకి ప్రవేశించి ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పు పెట్టుకుంది. వెంటనే వాసుతోపాటు ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థుల సాయంతో మంటలను ఆర్పి ప్రశాంతిని కుప్పంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం ఆమెను పీఈఎస్ ఆసుపత్రికి, అక్కడినుంచి తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తీసుకువెళ్లి చేర్చారు.

అప్పటి నుంచి రుయాలో చికిత్స పొందుతూ ప్రశాంతి శుక్రవారం ఉదయం మృతి చెందింది. కాగా ఆమె మృతికి కారకుడైన వాసును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ప్రశాంతి తల్లి మాలతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య తెలిపారు.

కబ్జా కోరల్లో చెరువులు - ఆందోళనలో రైతులు

గాలివీడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు చెరువులే రైతులకు ప్రధాన నీటి వనరులు. పల్లెసీమల్లో పాడి పంటలకు చెరువులే ఆధారం. ఒక్కసారి నిండితే రెండు కార్లపంటలు సాగే పరిస్థితిలో ఉండేది. అలాంటి చెరువులు కబ్జాదారుల కోరల్లో చిక్కుకొని ఒక్క పంట సాగు కూడా నోచుకోలేకుండా పోతున్నాయి. నేడు అక్రమార్కుల చెరలో విలవిలలాడుతున్నాయి. గాలివీడు మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 205 పల్లెలు ఉన్నాయి. ప్రతి పల్లెలో చెరువులు, కుంటలు ఉన్నాయి. ఒకప్పుడు ఈ చెరువులు, కుంటల కింద వందల ఎకరాలు పంటలు సాగు చేసేవారు. గతంలో బోరుబావులు, ప్రాజెక్టులు లేకపోవడం వల్ల సాగు భూమి అంతా చెరువులు కిందే ఉండేది. ఆ కాలంలో చెరువుల్లో నీటితో భూ గర్భజలాలు పెంపొందేవి. ముఖ్యంగా చెరువుల కింద వరి, జొన్న, ప్రొద్దుతిరుగుడు, సజ్జ, రాగి పంటలతో పాటు మిరప, టమోటా, వంగ, బెండ, మొటిక పంటలు సాగు చేసేవారు. ఒక్కో చెరువు కింద 20 ఎకరాల నుంచి వంద ఎకరాల సాగు భూములు ఉండేవి.





కబ్జాకు గురైన గాలివీడు పెద్దచెరువు... ఆక్రమణలో తూముకుంట పంచాయతీ పరిధిలోని నేరేడు చెరువు

ఆక్రమణకు గురవుతున్న చెరువులు

మండలంలో తలముడిపి పెద్దచెరువు, గాలివీడు పెద్దచెరువు, పందికుంట చెరువు, నీసీపల్లెల్లోని కొత్తచెరువు, తూముకుంటలో నేరేడు చెరువులు నూలివీడులోని మెరగల చెరువులు దాదాపు వంద ఎకరాల విస్తీర్ణం. వాటి కింద ఆయకట్టు కూడా వందెకరాల వరకు ఉంది. తూముకుంట పంచాయతీలోని నేరెడ్డిచెరువు, గంగిరెడ్డిచెరువు, ఎర్రమానిచెరువులు ఆక్రమణకు గురయ్యాయని రైతులు ఆరోపిస్తున్నారు. గాలివీడు పెద్దచెరువు ఎక్కువ ఆక్రణమకు గురైంది. కబ్జాదారులు చెరువులను ఆక్రమించి రియల్ ఎస్టేట్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ చెరువు గాలివీడు, రాయచోటి ప్రధాన రహదారికి సమీపంలోనే ఉండడం వల్ల ఇక్కడ భూములకు రేట్లు ఎక్కువగా ఉన్నాయి. తూముకుంట పంచాయతీలో పెద్దచెరువు చాలా వరకు ఆక్రమణకు గురైందని రైతులు పేర్కొన్నారు. మండలంలోని చెరువులు అన్నీ ఆక్రమణకు గురయ్యాయని, చాలా చెరువులు విస్తీర్ణం తగ్గిపోయాయని రైతులు పేర్కొన్నారు. చెరువులు కబ్జాకు గురికావడం వల్ల విస్తీర్ణంతో పాటు ఆయకట్టు సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోతోందని రైతులు పేర్కొన్నారు. చెరువుల ఆక్రమణలకు గురౌతున్న విషయాన్ని నీటి పారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు తెలిపారు. అలాగే కొన్ని గ్రామాల్లో కుంటలను ఆక్రమించుకున్నారన్నారు. అధికారుల పట్టించుకోకపోతే చెరువులు అన్నీ ఆక్రమణదారులు చేతుల్లోకి వెళ్లిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా చెరువులను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఇకపై కబ్జాకు గురికాకుండా చూడాలని కోరారు.

చెరువులను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

మండలలోని చాలా చెరువులు, కుంటలు, కబ్జాకు గురయ్యాయి. ముఖ్యంగా తూముకుం ట పంచాయతీలో నేరేడుచెరువు ఒకప్పుడు ఎక్కువ విస్తీర్ణం ఉండేది. ఆ చెరువు నేడు ఆక్రమణల వల్ల కుచించుకుపోయింది. గంగిరెడ్డి, ఎర్రమానిచెరువులు కూడా ఆక్రమణకు గురయ్యాయి. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దుల గుర్తించి చెరువుల ఆక్రమణలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.



\- రామ్మోహన్‌నాయుడు, తూముకుంట

చెరువుల ఆక్రమణలపై చర్యలు

గాలివీడు మండలంలోని చెరువులు, కుంటల ఆక్రమణలపై ఇదివరకే ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు కొన్ని చెరువులను పరిశీలించాం.చెరువులను ఆక్రమించిన వారు ఎంతటి వారైనా సరే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటాం.

\- కళ్యాణ్, ఇరిగేషన్ జేఈ

బీమా పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న బోయనపల్లె యూనియన్ బ్యాంకు మేనేజర్ నాగరాజు

రాజంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :రాజంపేట మండలం కొత్తబోయనపల్లె యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం రాజంపేట మండలంలోని మిట్టమీదపల్లె గ్రామంలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న బీమా పథకాలపై అవగాహన కల్పించారు. బోయనపల్లె యూనియన్ బ్యాంకు మేనేజర్ బి.నాగరాజు బ్యాంకు అధికారి బి.ఉదయ్‌కుమార్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుపరిచే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు

చిట్వేలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఏడాది మండలంలో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మానవతా చిట్వేలిశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభ అవార్డులు పంపిణీ చేశారు. ఈ మేరకు చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కోదండనాయుడు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సచివాలయ సర్వేయర్లు బాధ్యతల స్వీకరణ

సంబేపల్లె, జూలై25(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలంలోని మోటకట్ల, నారాయణరెడ్డిపల్లె, గురిగింజకుంట సచివాలయ సర్వేయర్లుగా శుక్రవారం తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి వద్ద తమ బదిలీ పత్రాలు అందజేసి బాధ్యతలు స్వీకరించారు. మోటకట్ల గ్రామ సచివాలయ సర్వేయర్‌గా అశోక్, నారాయణరెడ్డిపల్లె గ్రామ సచివాలయ సర్వేయర్‌గా విజయలక్ష్మి, గురిగింజకుంట గ్రామ సచివాలయ సర్వేయర్‌గా, గోవర్ధన్‌నాయక్ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిన్నమండెం మండలం నుంచి సంబేపల్లెకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన భూ సమస్యల అర్జీలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని సచివాలయ సర్వేయర్లు తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

నందలూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సమాచారహక్కు చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి జి.మల్లికార్జున స్పష్టం చేశారు. మండలంలోని నల్లతిమ్మయపల్లె రైతు సేవా కేంద్రం నందు శుక్రవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నాం

● సోలార్ ప్లాంట్ సెక్యూరిటీ ఎండీ వినోద్

గాలివీడు, జూలై25(ఆంధ్రజ్యోతి): సోలార్‌లో పనిచేస్తున్న సిబ్బందికి క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తున్నామని, జూన్ మాసానికి సంబంధించి మాత్రం పది రోజులు ఆలస్యం అయ్యిందని తూముకుంట టాటా సోలార్ కంపెనీ స్టార్ క్యూబెక్స్ సెక్యూరిటీ ఎండీ వినోద్, రీజినల్ మేనేజర్ భాస్కర్ వివరణ ఇచ్చారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రాజెక్టు పరిధిలో రూ.30 లక్షల విలువైన 25 వేల మీటర్ల కేబుల్ వైరు చోరీకి గురైతే ఇదే సమస్యపై క్లయింట్‌కు నచ్చజెప్పే పనిలో వేతనాలు చెల్లింపు పది రోజులు ఆలస్యమైన మాట వాస్తవమేనన్నారు. అయితే విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం కారణంగానే ఇదంతా జరిగిందని, ఇలాంటి పరిస్థితుల్లో కూడా వేతనాలు చెల్లింపులో జాప్యం జరిగిందంటూ సిబ్బంది రోడ్డెక్కడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పరిదిలో దాదాపుగా పదుల సంఖ్యలో చోరీలు జరుగుతున్నప్పటికీ సిబ్బంది అడ్డుకోలేకపోవడం శోచనీయమంటూ విచారం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

రాజంపేట టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్, వికసిత ఫౌండేషన్, కళాశాల రెడ్ రిబ్బన్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ పురుషోత్తం, జేబీవీఎస్ వ్యవస్థాపకులు అశోక్, రెడ్‌క్రాస్ మెడికల్ అధికారి డాక్టర్ యశస్వి రెడ్డి, రెడ్‌రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.

భువనేశ్వరి అమ్మవారికి శ్రావణమాస పూజలు

రైల్వేకోడూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వర స్వామి ఆలయంలో వెలసిన భువనేశ్వరి అమ్మవారికి శుక్రవారం శ్రావణమాస పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దూర్జటి యోగీస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, పూలాంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు రాహుకాలపు పూజలు చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడిగా మురళీకృష్ణ

సిద్దవటం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం ప్రభుత్వ ఉద్యోగుల తాలుకా యూనిట్ అధ్యక్షులుగా సి.మురళీకృష్ణ ఎన్నికైనట్లు జిల్లా జనరల్ సెక్రటరి రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన సిద్దవటం తాలుకా యూనిట్ ఎంప్లాయీస్ అధ్యక్షులు మురళీకృష్ణ శుక్రవారం సిద్దవటంలో మాట్లాడుతూ రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంఘం ఉద్యోగుల యూనియన్ తరపున సిద్దవటం తాలుకా యూనిట్ మండల అధ్యక్షులుగా ఎంపిక చేశారని, ఉద్యోగ సమస్యలపై నిరంతరం కృషి చేస్తామన్నారు.

నిత్యావసర సరుకులను సకాలంలో పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశులు

రామాపురం, జూలై25(ఆంధ్రజ్యోతి): డీలర్లు 1వ తేదీన ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ వెంకటేశులు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డీలర్ల సమావేశం నిర్వహించారు.ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ వెంకటరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కృపావతి, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సమ్మద్‌ఖాన్, మండల డీలర్లు పాల్గొన్నారు.

బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి: సీఐటీయూ

రైల్వేకోడూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): బొప్పాయి రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, ఏపీ రైతు సంఘం కన్వీనర్ సుభాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ కనీసం కిలో రూ.25 చేయాలన్నారు. బొప్పాయి టన్ను ధరను మొదటిగా రూ.16,000 చేశారని ప్రస్తుతం రూ.13,000కు తగ్గించారన్నారు. దళారులు కమీషన్లకు ఆశపడి బడా వ్యాపారులకు లాభాలు తెచ్చిపెడుతున్నారని, దీంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని బొప్పాయి రైతులను ఆదుకోకుంటే పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

మహిళల భద్రతకు శక్తి యాప్

రాయచోటిటౌన్, జూలై25(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శంకరమల్లయ్య తెలిపారు. రాయచోటి గర్ల్స్ హైస్కూల్‌లో శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తి యాప్ వాట్సాప్ 7993485111 నెంబర్‌ను మహిళలు, విద్యార్థినులు సేవ్ చేసుకోవాలన్నారు. శక్తి టీం బృందాలు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, రైల్వేస్టేషన్, షాపింగ్ మాల్స్, పట్టణ కేంద్రంలోని వివిధ ముఖ్యమైన కూడళ్లలో మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ యాప్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా రక్షణ ఉంటుందని, 112 డయల్ చేయడంతో పాటు ఎస్‌వోఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్న, ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినా ఈ యాప్ టీజింగ్, బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్ నేరాలు, మోసాలు, మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాల గురించి తెలిసిన వెంటనే డయల్ 100, 112, 181, 1098, 1930 మొదలగు టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

'ఆగస్టు 7న చలో విద్యుత్ సౌధ'

రాజంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆగస్టు 7న చలో విజయవాడ విద్యుత్ సౌధ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రవికుమార్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ కార్యదర్శి శ్రీహరి తెలిపారు. శుక్రవారం రాజంపేట విద్యుత్ కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం రాజంపేట మండలంలోని శేషమాంబపురం, పాపరాజుపల్లె గ్రామాల్లో ఇంటింటికి సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలుకరిస్తూ కూటమి ప్రభుత్వం యేడాదిలో నిర్వహించిన సంక్షేమ అభివృద్ధి పథకాల గురించి వివరించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లె ప్రతాప్‌రాజు, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఉచిత కంటి పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ

రాజంపేట టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట డివిజన్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు డాక్టర్ అరవింద నేత్రాలయ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ ఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే, ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పల్లేటి రామసుబ్బారెడ్డి, అన్నమయ్య జిల్లా ఏపీడబ్ల్యూజే అధ్యక్షుడు శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య మా ట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలూ కృషి చేస్తున్న జర్నలిస్టులకు డాక్టర్ అరవింద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, రాజంపేట తాలుకా అధ్యక్షుడు ఇండ్లూరి చిన్న వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి శివ, నందలూరు సీనియర్ పాత్రికేయులు బాలాజీ, శివశంకర్, మలిశెట్టి సుబ్బనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

రాజంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర అనారోగ్యానికి గురైన వారికి సీఎం సహాయ నిధి చెక్కులను అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ పంపిణీ చేశారు. శుక్రవారం బీము గోపాల్ రెడ్డి, సింగరాజు జ్ఞానకీర్తనలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మాజీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, తాను కలిసి రాజంపేట పార్లమెంట్ పరిధిలో అనారోగ్యంపాలైన వారి వివరాలను సీఎంకు అందజేయగా సుమారు ఏడుగురికి సీఎం సహాయనిధి చెక్కులు అందించార న్నారు. బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సునీతానారాయణ, తోట శ్రీనివాసులు, పట్టణ బీజేపీ అధ్యక్షులు వీవీ రమణ, రూరల్ అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ముక్కా



సీఎం చంద్రబాబుతో చర్చిస్తున్న ముక్కా

రైల్వేకోడూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని అమరావతిలో టీడీ పీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, తాగునీటి ప్రాజెక్టులు, వసతులపై ముఖ్యమంత్రితో చర్చించామని ముక్కా తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీలో రైల్వేకోడూరు అసెంబ్లీ స్థానం రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందని అభినందించారన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

ఏకిరిపల్లెను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న రమేశ్‌నాయుడు

రాజంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మారుమూల అటవీ ప్రాంతమైన రాజంపేట మండలం ఏకరిపల్లె గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఏకిరిపల్లె గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకరిపల్లె గ్రామ రహదారిని నిర్మించేందుకు 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్‌తో కలిసి పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్‌తో మాట్లాడి రూ.3.60 కోట్లతో నివేదిక పంపగా ప్రభుత్వం ఆ నిధులను మంజూరు చేసిందన్నారు. బీజేపీ నాయకులు పట్టుపోగుల ఆదినారాయణ, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

ఏపీ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడి నియామకం



నియామక పత్రం అందుకుంటున్న దృశ్యం

ఓబులవారిపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఏపీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా పామూరు జయదీపక్‌రెడ్డిని ఏగ్రీవంగా ఎన్నుకుని రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేంద్ర నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దీపక్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతి అక్రమాలపై పోరాటాలు చేస్తామ న్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పెనగలూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తసింగనమల వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుల్లో ఒకరిని తిరుపతి రుయాకు, మరొకరిని రాజంపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. తూర్పుపల్లెకు చెందిన ముగ్గురు గురువారం రాత్రి బైకుపై రాజంపేట నుంచి తూర్పుపల్లెకు వస్తుండగా బెస్తపల్లె వైపు వెళుతున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఈ సంఘటన జరిగినట్లు సమాచారం. పెనగలూరు ఎస్ఐ రవిప్రకాశ్ రెడ్డిని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

యజమానులు పందులను తరలించుకుపోవాలి

ఒంటిమిట్ట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పందుల యజమానులు తమ పందులను తరలించుకుపోవాలని ఒంటిమిట్ట పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తెలిపారు. శుక్రవారం పందుల యజమానులు తమ పందులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ గ్రామంలో పందులు ఎక్కువగా ఉన్నాయని, పలు ఫిర్యాదులు వచ్చాయన్నారు. కావున పందులను మీరు తీసుకెళ్లాలన్నారు. పందులను పట్టుకోకపోతే యజమానులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అంజి, పందుల యమానులు పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి'

రైల్వేకోడూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు లో 11వ ఆర్‌ఎస్‌యూ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.6,400 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. దీని వల్ల విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, పీజి పూర్తి చేసుకున్న వారి సర్టిఫికెట్లను కళాశాలల వారు ఇవ్వడం లేదన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురౌతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేడు వెలగచర్లలో చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం



భూదేవి శ్రీదేవి సమేత చెన్నకేశవస్వామి... విద్యుద్దీపాలంకరణలో వెలగచర్లలోని చెన్నకేశవస్వామి దేవాలయం



పెనగలూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగచర్ల గ్రామంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. చెన్నకేశవస్వామి దేవాలయం నిర్మించిన మూడో వార్షికోత్సవం సందర్భంగా శనివారం వేకువజాము నుంచి మూలవిరాట్‌లకు అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని వారు వివరించారు.

పీ4 ద్వారా పేద కుటుంబాల అభివృద్ధి

లక్కిరెడ్డిపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పీ4 ద్వారా నిరుపేద కుటుంబాలు అభివృద్ధి చెందవచ్చునని ఎంపీడీవో ఉషారాణి, తహసీల్దార్ క్రాంతికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మద్దిరేవుల గ్రామంలో సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ ఆధ్వర్యంలో పీ4 సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నిరుపేద కుటుంబాలను గుర్తించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు రజనీశ్‌రెడ్డి, సిరిబాబు పాల్గొన్నారు.

పైపులైన్, కుళాయిలు ఏర్పాటు చేస్తాం: డీఈ

సుండుపల్లె, జూలై25(ఆంధ్రజ్యోతి): మడితాడు గ్రామ పంచాయతీ వానరాచపల్లి బిడికీలో పైపులైన్, కుళాయిలు ఏర్పాటు చేస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'నిత్యం నీటి కష్టాలు.. గ్రామస్థులకు తిప్పలు' అనే కథనం రావడంతో శుక్రవారం వారు గ్రామస్థులతో మాట్లాడమన్నారు. డీఎంఎఫ్ ఫీజులను వినియోగించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. పంపు సెట్టును ఏర్పాటు చేసి తాగునీటి సమస్య తీరుస్తామన్నారు.

బంగారు కుటుంబాలను గుర్తించాలి



'పీ-4'పై అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన 'పీ-4' విధానంతో బంగారు కుటుంబాలను గుర్తించాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలిసి ఇతర అధికారులు సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జీరో పావర్టీ కింద ప్రభుత్వం చేపట్టిన 'పీ-4' విధానంలో గ్రామాలు, పట్టణాల్లో బంగారు కుటుంబాలను గుర్తించాలన్నారు. ఆర్థిక స్థోమత వున్న వారిని గుర్తించి వారి సహాయంతో నిరుపేదలను వారికి తోచిన విధంగా ఆర్థికంగా ఆదుకునేలా సహకారం కోరాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సాధికారత కోసం సీఎం చంద్రబాబు 'పీ4' ప్రారంభించారని, అధికారులు కూడా బాధ్యతగా పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీఓలు తాజ్‌మస్రూర్, రమేశ్‌బాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలపై కేసు నమోదు

పీలేరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహా మరికొందరు వైసీపీ నేతలపై పీలేరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసు యాక్టు 30 అమలులో ఉన్నప్పుడు పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ బుధవారం పీలేరులోని డా.బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. దీంతో పోలీసులు అందులో పాల్గొన్న చింతల రామచంద్రారెడ్డి, పీలేరు మండల వైసీపీ అధ్యక్షుడు దండు జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ కంభం సతీశ్ రెడ్డి, జడ్పీటీసీ రత్నశేఖరరెడ్డి, సర్పంచ్ హబీబ్ బాషా, నాయకులు ఉదయ, షాకీర్, మునీర్, గాయం భాస్కరరెడ్డితో పాటు మరికొందరిపై కేసు (నెం.181/2025) నమోదు చేశారు.

ఆటోను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

గుర్రంకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆటోను కారు అతివేగంగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం సూరప్పగారిపల్లె వద్ద జరిగింది. రామాపురం మండలం గువ్వలచెరువుకు చెందిన సలీమ్, జాకీర్ ఆటోలో పాలఖవ్వ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో భాగంగా వీరు ఆటోలో గుర్రంకొండకు వస్తుండగా మండలంలోని సూరప్పగారిపల్లె వద్ద మదనపల్లె నుంచి రాయచోటికి వెళుతున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న సలీమ్, జాకీర్‌కు గాయాలయ్యాయి. బాధితులను రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు.

'భూములు దురాక్రమణ కానివ్వద్దు'



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

తంబళ్లపల్లె, జూలై 25(ఆంధ్రజ్యోతి): జుంజురపెంట పంచాయతీ నేరేడు కొండపై వెలసిన నేరేడు కొండ్రాయ స్వామి ఆలయ భూములు దురాక్రమణ కాకుండా కాపాడాలని మూడు గ్రామాల ప్రజలు తహసీల్దారు శ్రీనివాసులును కోరారు. శుక్రవారం జుంజురపెంట, ఆర్‌ఎన్ తండా, కొట్టాల గ్రామాల ప్రజలు, నేరేడు కొండయ్యస్వామి ఇలకాపులు బండారి నాగరాజ ఆధ్వర్యంలో తహసీల్దారును కలిసి వినతి పత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ దాదాపు 700 ఏళ్ల కిందటి నుంచి పూజలందుకుంటున్న నేరేడు కొండ్రాయస్వామి ఆలయానికి తంబళ్లపల్లె మండలంలోని జుంజురపెంట, ములకలచెరువు మండలంలోని కాలువపల్లె పంచాయతీల్లో మాన్యం భూములు ఉన్నాయన్నారు. బురుజుపల్లెకు చెందిన కొందరు నేరేడు కొండ్రాయస్వామి ఆలయం పేరుతో దాతల నుంచి డబ్బు వసూలు చేశారని, ఇప్పుడు మాన్యం భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జుంజురపెంట నేరేడు కొండపై ఉన్న నేరేడు కొండ్రాయస్వామి ఆలయానికి, బురుజు పల్లెలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి గుడికి ఎటువంటి సంబంధం లేదన్నారు. అధికారులు స్పందించి ఆలయ భూములు దురాక్రమణ కాకుండా చూడాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, నేరేడు కొండయ్యస్వామి ఇలకాపులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

రామాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టోల్‌గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెందాడు. స్థానికుల, పోలీసుల వివరాల మేరకు... పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కడప నుంచి పుంగనూరుకు వెళుతుండగా మార్గమధ్యలో టోల్‌గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఆ వ్యక్తి దుర్మరణం చెందాడు. కాగా బస్సు డ్రైవర్ రాయచోటి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అదుపులో ఉన్నట్లు సమాచారం.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భోజనం పెట్టేదెలా..?

- వసతి గృహ అధికారులపై మెనూ భారం
- మెనూలో సవరణలకు తావులేని జీవో 8
- మానసిక ఒత్తిడిలో హెచ్‌డబ్ల్యూవోలు
- వైసీపీ అనాలోచిత చర్యలు.. బీసీ వసతిగృహాలకు శాపాలు



సంబేపల్లె, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయలేక అధికారులు సతమతమవుతున్నారు. గతంలో ధరలకు అనుగుణంగా మెనూ చేర్పులు, మార్పులకు వీలుగా ప్రిన్సిపల్ సెక్రటరీ జీవో విడుదల చేసేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2022లో ప్రభుత్వం క్యాబినెట్‌లో ధరలు లేని మెనూతో జీవో నెంబర్ 8 అమలు చేసింది. దీంతో వసతి గృహ అధికారులపై భారం పడుతోంది.

మార్కెట్‌లో ప్రతి వస్తువుకు ధర ఉంది. ధర లేకుండా మెనూ పెట్టడం ఒక్క వైసీపీ ప్రభుత్వానికే చెల్లింది. బియ్యం, కందిబేడలు, ఆయిల్, చింతపండు, కోడిగుడ్డు, అరటిపండు, గోధుమపిండితో పాటు వివిధ రకాలతో మెనూ కోసం ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ఒక్క రోజుకు రూ.46 కేటాయించింది. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరల ప్రకార ఒక్కో విద్యార్థికి సరాసరి రోజుకు రూ.59 ఖర్చవుతోంది. దీంతో ఒక్క విద్యార్థిపై ఒక రోజుకు రూ.13 అదనపు భారం పడుతున్నట్లు వసతి గృహ అధికారులు (హెచ్‌డబ్ల్యూవో) లబోదిబోమంటున్నారు. ధరలను బట్టి మెనూ మార్చే అధికారం ఆయా జిల్లాల కలెక్టర్లకు ఉంటే మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం క్యాబినెట్‌లో జీవో నెంబర్ 8 పెట్టడంతో కలెక్టర్లకు కూడా మెనూ మార్చే అధికారం లేదు. దీంతో వైసీపీ అనాలోచిత చర్య వసతి గృహ అధికారులకు శాపంగా మారిందని చెప్పవచ్చు.

ఎఫ్ఆర్ఎస్‌లో సాంకేతిక లోపంతో..

బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యారుల హాజరు కోసం ప్రభుత్వం ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) పద్ధతిని ప్రవేశపెట్టింది. విద్యార్థుల హాజరు ముఖం ఆధారంగా నమోదు చేస్తారు. అయితే ఎఫ్ఆర్ఎస్ సిస్టంలో సాంకేతిక లోపాలతో ఒక్కోరోజు కొంతమంది విద్యార్థుల హాజరు నమోదు కావడంలేదు. దీంతో హెచ్‌డబ్ల్యూవోలపై అదనపు భారం పడుతుంది. కేవలం బీసీ వసతి గృహాల్లో మాత్రమే ఈ విధానం ప్రవేశపెట్టారు. వసతి గృహ అధికారులు సెలవులో ఉన్నప్పుడు ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం హాజరును నమోదు చేసేందుకు అవకాశం లేదు. ట్యాబులు, సెల్‌ఫోన్లను ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో కూడా నష్టపోతున్నట్లు చెబుతున్నారు.

స్కావెంజర్స్ నియామకాల్లేవు

సంక్షేమ వసతి గృహాల్లో పరిశుభ్రతను పాటించాలని ఒక పక్క చెబుతున్నా ఆ దిశగా నిబంధనలు పాటించడం లేదని చెప్పవచ్చు. బాత్‌రూంలు, మరుగుదొడ్ల శుభ్రతకు ఫినాయిల్ ఇవ్వరు. యాసిడ్ ఉండదు. వీటిని శుభ్రపరిచేందుకు స్కావెంజర్స్ నియామకం జరపడం లేదు. దీంతో హాస్టళ్ల పరిశుభ్రత కూడా వసతి గృహ అధికారులపై అదనపు భారం పడుతోందని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీ హాస్టళ్ల పరిశుభ్రతకు స్కావెంజర్స్ నియామకం చేపట్టాలని కోరుతున్నారు.



బీసీ వసతి గృహ విద్యార్థులకు రోజు వారీ మెనూ

ఒత్తిడిలో హెచ్‌డబ్ల్యూవోలు

సంక్షేమ వసతి గృహాల నిర్వహణ అమలులో హెచ్‌డబ్ల్యూవోలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్పవచ్చు. ప్రభుత్వం పెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలంటే అదనపు భారం తప్పడం లేదు. ఇక వసతి గృహ నిర్వహణ బాధ్యతలు భారంగా మారుతున్నాయి. దీంతో మానసిక ఒత్తిడికి గురై ఆందోళనతో చనిపోతున్నారు. వారం క్రితం బాపట్ల జిల్లా అద్దంకి హెచ్‌డబ్ల్యూవో మరణించారు. 2022లో వైసీపీ ప్రభుత్వం వసతి గృహాల్లో మెనూ కోసం జారీ చేసిన జీవో నెంబర్ 8ని రద్దు చేసి ఆయా జిల్లాల్లో స్థానికంగా ధరలకు అనుగుణంగా మెనూలో మార్పులు, చేర్పులు చేసే అధికారం జిల్లా కలెక్టర్లకు ఇవ్వాలని హెచ్‌డబ్ల్యూవోలు కోరుతున్నారు. లేదంటే వసతిగృహాల్లో విద్యార్థులకు భోజనం పెట్టడం తలకు మించిన భారమేనని వాపోతున్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ బస్సులోనే డ్రైవర్ మృతి

- ప్రయాణికులు క్షేమం



రోడ్డుపక్కన ఆగిని ఆర్టీసీ బస్సు, రసూల్ మృతదేహాన్ని బయటికి తీస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాయచోటిటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో కావలి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ రసూల్ (55) గుండెపోటుతో బస్సులోనే మృతి చెందగా.. బస్సులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. పోలీసులు, ప్రయాణికుల కథనం మేరకు.. కావలి డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు గురువారం బెంగళూరుకు బయలుదేరింది. మార్గమధ్యంలోని రాయచోటి బస్టాండుకు తెల్లవారుజామున వచ్చింది. అనతరం బెంగళూరుకు బయలుదేరగా మదనపల్లె రోడ్డులోకి రాగానే డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో ఆయన పక్కకు ఒరిగిపోయాడు. దీంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు వచ్చి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సీట్‌లోనే మృతిచెందగా అందులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్ రసూల్ మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ గుండెపోటుతో మృతిచెందడంతో బస్సు అదుపు తప్పిందా... లేక ఆయన నిద్రమత్తులో ఉండటంతో అదుపు తప్పిందా అనేది పోస్టుమార్టంలో తెలుస్తుందని ట్రాఫిక్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

రాజమండ్రి నుంచి డిప్యూటీ సర్వేయర్ అన్నమయ్యకు బదిలీ

కలికిరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి నుంచి డిప్యూటీ సర్వేయర్ కె.సుస్మితను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. భార్యాభర్తల కేటగిరీ కింద తనను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేయాలని ఆమె చేసుకున్న దరఖాస్తుపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుని బదిలీ ఆదేశాలు జారీ చేసింది. జోన్ మొత్తం మీద 15 శాతం మించి నాన్‌లోకల్ లేకుండా చూసుకోవాలని, జిల్లాలో సీనియారిటీ జాబితాలో స్థానిక ఉద్యోగుల తరువాత నమోదు కావాలనే నిబంధనలు విధిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎర్రచందనం కేసుల కోర్టు ఎస్‌పీపీగా అమరనారాయణ

మదనపల్లెటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల విచారణ కోర్టు (తిరుపతి) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మదనపల్లె వాసి న్యాయవాది ఎ.అమరనారాయణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఎస్‌పీపీగా విధుల్లో చేరిన రోజు నుంచి మూడేళ్లు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆయనకు గౌరవ వేతనంగా ప్రభుత్వం నెలకు రూ.40 వేలు చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

- డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు

రాయచోటిటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని రాయచోటి డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి డైట్ కేంద్రంలో రెండు సంవత్సరాల డీఈఎల్ఈడీ కోర్సు ప్రారంభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి విచ్చేసిన ఉపాధ్యాయ శిక్షణ పొందగోరే ఛాత్రోపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. డైట్ లాంటి ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో పనిచేయడం గౌరవ ప్రదమైన విషయమన్నారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్లు శివభాస్కర్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, ఉషారాణి, నూతన ఛాత్రోపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శుక్రవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రాల మధ్య భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలను నిర్వహించారు. రాహుకాల పూజల విశిష్టత గురించి అర్చకులు మహిళా భక్తులకు వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కలెక్టర్ చొరవతో విద్యార్థినికి కృత్రిమ చెయ్యి



నవోదయ విద్యార్థినికి కృత్రిమ చెయ్యి అమర్చిన వైద్యులు

మదనపల్లె అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వలసపల్లె పంచాయతీ జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థిని శివానీకి శుక్రవారం తిరుపతి రిమ్స్‌లో కృత్రిమ చెయ్యిని ఏర్పాటు చేసినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గీత పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పుట్టుకతోనే ఒక చెయ్యి లేకుండా పుట్టిందని, సొంత పనులు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్న శివానీ విషయం కలెక్టర్ శ్రీధర్‌కు తెలియజేశామన్నారు. కలెక్టర్ చొరవతో తిరుపతిలోని రిమ్స్ ఉపసంచాలకులు ఆర్‌వీ కృష్ణకిషోర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్ఓ శ్రీకాంత్ పర్య వేక్షణలో ఆర్థోటిక్స్ డాక్టర్ జగదీష్ శివానీకి కృత్రిమ చెయ్యిని అమర్చారు. దివ్యాంగు రాలైన శివానీ ఎడమ చేతితోనే 2023 గుజరాత్‌లోను, 2024 బెంగళూరులో నిర్వహించిన పారా జాతీయ క్రీడల్లో జావలిన్ త్రో, షాట్‌పుట్‌లో రెండేళ్లు బంగారు పతకాలు సాధించారన్నారు. 2023లో థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ పారా స్పోర్ట్స్‌లో జావలిన్ త్రో, షాట్‌పుట్‌లో రెండు బంగారు పతకాలను, 2024లో థాయ్‌లాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పారా స్పోర్ట్స్‌లో షాట్ పుట్‌లో బంగారు పతకాల పంట పండించిందని ప్రిన్సిపాల్ వివరించారు. శివానికి కృత్రిమ చెయ్యి అమర్చడంతో మరెన్నో బంగారు పతకాలను సాధిస్తోందని ప్రిన్సిపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. తన పనులు తాను చేసుకోవడానికి కృత్రిమ చెయ్యిని ఏర్పాటు చేయించిన కలెక్టర్ శ్రీధర్‌కు శివాని కృతజ్ఞతలు తెలిపారు.

'కళాకారుల పాత బకాయిలు చెల్లించాలి'

పీలేరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కళాకారులకు అందాల్సిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, అనంతపు రం జిల్లాల కళాకారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజయవా డలోని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు పెంచలయ్యను కలిసి వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడుతూ 2018-19 ఆర్థిక సంవత్సరంలో జరిగిన జన్మభూమి-మన ఊరు, గ్రామదర్శిని కార్యక్రమాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన కళాకారులకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పట్లో రాష్ట్రంలో ఉన్న 13 ఉమ్మడి జిల్లాల్లోని ఆరు జిల్లాల కళాకారులకు బకాయిలు చెల్లించారని, ఆ తరువాత వాటి గురించి ఎవరూ పట్టించుకోలేదన్నారు. కళలనే నమ్ముకున్న కళాకారులకు ప్రభుత్వ కార్యక్రమాల్లో కళాప్రదర్శనలు ప్రదర్శించి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల సమన్వయకర్తలు ప్రవీణ్, తరిమిళ్ల రాజు టింగ్ టింగ్ వెంకటేశ్, కళాబృందాల నాయకులు ఖాదర్‌బాషా, కలకట రెడ్డప్ప, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక శాఖ రాష్ట్ర సహాయ సంచాలకుడు పెంచలయ్యతో కళాబృందాల నేతలు

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి: డిప్యూటీ సీఈఓ

పీలేరురూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణంపై పంచాయతీ అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం పీలేరు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో సుమారు 60 వేలు పైచిలుకు జనాభా ఉన్నారని, అయితే ఇంత వరకూ పట్టణంలో ఎక్కడా పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడమేమిటని ప్రశ్నించారు. పట్టణంలో అనువైన ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులతో సంప్రదించి టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ లతీఫ్‌ఖాన్‌ను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ జీ.శివశంకర్, ఏఓ రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలేవి

- తూతూమంత్రంగా మరోసారి నోటీసులు
- పూర్తయిన ఇంటి నిర్మాణం



శుక్రవారం మూడోసారి నోటీసులు అందజేస్తున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

సుండుపల్లె, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇంటి అక్రమ నిర్మాణంపై చర్యలు మృగ్యమయ్యాయి. అక్రమ నిర్మాణాన్ని శుక్రవారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ సురేశ్ బాబు, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, సిబ్బంది పరిశీలించారు. గత వారం రోజుల నుంచి నోటీసులు మీద నోటీసులు ఇచ్చినా అక్రమ ఇంటి నిర్మాణం ఆగలేదు. గురువారం రాత్రి మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీ చీనేవాండ్లపల్లెకు చెందిన ఓ వ్యక్తి స్లాబ్ పూర్తి చేశారు. బేస్‌మట్టం నిర్మాణం నుంచి కలెక్టర్, సుండుపల్లె మండల రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. సాక్షాత్తు జిల్లా, నియోజకవర్గ అధికారులే నిర్మాణం ఆపాలని చెప్పినా ఆగలేదు. ఐదు రోజుల క్రితం డీపీవో మస్తాన్‌వలి అదిఅక్రమ నిర్మాణం దీనిపై చర్యలు తీసుకుంటామని పల్లెకు వెళ్లి మరీ హెచ్చరించారు. గతంలో రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. అయినా నిర్మాణదారులు తగ్గనేలేదు. గురువారం మరోమారు అధికారులు నిర్మాణం ఆపకపోతే కేసు పెడతామని హెచ్చరించి వచ్చారు. అదేరోజు రాత్రి స్లాబ్ పూర్తి చేయడం ఆశ్చర్యంగా ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. మండలంలో అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో ఈ సంఘటనతో అర్థమవుతుంది. అయితే శుక్రవారం ఎంపీడీవో వెళ్లి ఇకపై కట్టవద్దని చెప్పి వచ్చానని పేర్కొన్నారు. ఉన్నది దొంగ పట్టా, దాన్ని రెవెన్యూ అధికారులు జారీ చేయలేదు. రికార్డుల్లో లేదని తేల్చిన నిర్మాణాన్ని పూర్తి చేయడంపై అధికారులు ఆపలేకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇకపై నిర్మాణం చేపడితే చర్యలు తప్పవు

- ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

ఇంటి నిర్మాణం విషయంలో ఇకపై పనులు చేపడితే కఠిన చర్యలు తప్పవు. ఈ విషయాన్ని డీపీవో దృష్టికి తీసుకెళతాం.

బొప్పాయి లారీలను అడ్డుకున్న రైతులు



బొప్పాయి కోతలను అడ్డుకున్న రైతులు

చిట్వేలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దళారుల రాజ్యంతో బొప్పాయి రైతులు కుదేల వుతున్నారు. ధరల తగ్గింపుతో కడుపు మండిన రైతులు చిట్వేలి మండలంలో గురువారం రోడ్డెక్కారు. అందులో భాగంగా శుక్రవారం రైతులు తమకు గిట్టుబాటు ధర ఇచ్చేవరకు బొప్పాయి కోయనివ్వమని లారీలను అడ్డుకున్నారు. మండలంలోని ప్రతి పల్లె తిరుగుతూ బొప్పాయ కటింగ్‌ను అడ్డుకున్నారు.

అప్పుల ఊబిలో బొప్పాయి రైతులు

బొప్పాయి సాగు చేస్తున్న రైతన్నకు అప్పులే మిగులుతున్నాయి. దీనికితోడు అతివృష్టి, అనావృష్టి వల్ల రైతాంగం అప్పుల ఊబిలో పడిపోయింది. నకిలీ విత్తనాలు, ఎరువులతో రైతులు కుదేలవుతున్నారు. ఎకరా పొలంలో బొప్పాయ సాగు చేస్తే నకిలీ విత్తనాలు, నకిలీ నారుతో సగం దిగుబడి కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను నట్టేట ముంచుతున్నారు.

దళారుల మాయాజాలం

బొప్పాయి రైతులపై దళారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. గురువారం రోడ్డెక్కిన రైతులు తమకు గిట్టుబాటు ధర కల్పించే వరకు కాయలు కోసేది లేదని తెగేసి చెబుతున్నా వినడం లేదు. కోతలను అడ్డుకున్న రైతులపై దళారులు వాగ్వాదానికి దిగారు. తమకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం జరిగే వరకు కాయలు కోయనివ్వమని రైతులు దళారులను హెచ్చరించారు.

అభివృద్ధి వైపు..
డీసీఎంఎస్ అడుగులు!


కడప నగరంలోని డీసీఎంఎస్ భవనం

గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో నష్టాల్లో కూరుకుపోయి, ఆర్థిక సమస్యలతో ఇంతకాలం సతమతమైన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) క్రమంగా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వంలో నియమితుడైన పీఐసీ కమిటీ చైర్మన్ జయప్రకాశ్ నేతృత్వంలో వ్యాపార విస్తరణకు సన్నద్ధమవుతోంది. సొసైటీ ఏర్పడినప్పటి నుంచి రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు సరఫరా చేసే బాధ్యతను నిర్వహిస్తోంది. వైసీపీ హయాంలో ఆ బాధ్యతలను రైతు భరోసా కేంద్రాలకు అప్పజెప్పడంతో.. డీసీఎంఎస్ మనుగడ కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. అప్పుడప్పుడూ ఇతర వ్యాపారాలు చేస్తున్నా.. ప్రైవేటు వ్యాపారులతో పోటీకి తట్టుకోలేక ఇబ్బందులు పడింది. ఈ నేపథ్యంలో సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీలు, గదులు, స్థలాలపై అద్దెల ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఐదేళ్ల కాలంలో సుమారు రూ.6 కోట్ల మేర నష్టాలను మూటగట్టుకుంది.

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియమించిన డీసీఎంఎస్ నూతన కమిటీ వ్యాపార విస్తరణకు సన్నాహాలు చేస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రసాయనిక ఎరువులు, పురుగు మందులు విక్రయించేందుకు ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేయనుంది. మైదుకూరు ప్రాంతంలో ఉద్యానపంటలతో పాటు వరి ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. ఈ ప్రాంతంలో ఉద్యాన పంటలకు అవసరమైన పురుగు మందులతో పాటు, యూరియా తదితర రసాయనిక ఎరువులను విక్రయించి లబ్ధి పొందాలనే ఆలోచనలో ఉంది. పులివెందుల ప్రాంతంలో చీనీ, అరటిలాంటి పంటలు అధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి. ఆ ప్రాంతానికి సంబంధించిన రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, టార్పాలిన్లు తదితరాలు మామిడి, బొప్పాయి పంటలు ఎక్కువగా సాగయ్యే రైల్వేకోడూరు ప్రాంతంలోఎరువులు, పురుగు మందులతో పాటు, వ్యవసాయ పరికరాలు విక్రయించాలని కమిటీ ప్రణాళికలు రూపొందిస్తోంది. గతంలో రాజంపేటలో ఏర్పాటు చేసిన బనానా రైపెనింగ్ చాంబర్‌ను కూడా పరిశీలించి, పరిస్థితులు అనుకూలిస్తే దానిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు యోచిస్తోంది. ఈ విధంగా ఆయా ఏరియాలకు సంబంధించి ఏఏ పంటలు సాగవుతాయి, ఎంత మేర ఎరువుల వ్యాపారం ఉంటుంది. దాని వల్ల ఎంత కమిషన్లు పొందవచ్చనే దానిపై కమిటీ చైర్మన్ జయప్రకాశ్ అధికారులతో చర్చిస్తున్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులతో ఆయన సుదీర్ఘంగా చర్చించి ఆయా కార్యాలయాలకు అవసరమైన స్టేషనరీ, ఇతర పరికరాలు సరఫరాల బాధ్యత డీసీఎంఎస్‌కు అప్పగించే విధంగా సహకరించాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు శాఖల అధిపతులతో చర్చించారు.

ఆదాయం అభివృద్ధికి చర్యలు



నష్టాలబారిన పడిన డీసీఎంఎస్‌ను అభివృద్ధి బాటలోకి తీసుకువచ్చేందుకు జిల్లా అధికారులతో పాటు రైతులు, సిబ్బంది సహకారంతో చర్యలు తీసుకుంటున్నాం. కడప నగరంలోని చెమ్ముమియ్యాపేట వద్ద ఉన్న స్థలం గతంలో తక్కువ మొత్తానికి లీజుకు ఇచ్చారు. దీనిని పునః పరిశీలించి లీజు మొత్తాన్ని పెంచే అంశాన్ని కూడా ఆలోచిస్తున్నాం.

- వై.జయప్రకాశ్, చైర్మన్, డీసీఎంఎస్ కమిటీ

స్థలాలు, భవనాల అద్దెలపై దృష్టి

డీసీఎంఎస్‌కు ఉన్న ఖాళీ స్థలాలు, భవనాల అద్దెల ద్వారా మరితం ఆదాయం పొందే విషయంపై పీఐసీ కమిటీ దృష్టి సారించింది. ఇప్పటికే ఖాళీ స్థలాలను లీజు ప్రాతిపదికన పొందిన వ్యాపారుల నుంచి అద్దె వసూళ్లపై దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా కడప నగరంలోని చెమ్ముమియ్యాపేట వద్ద గతంలో అతి తక్కువ ధరకు స్థలాలను లీజుకు ఇచ్చారనే విషయాన్ని పరిశీలిస్తోంది. భవిష్యత్తులో లీజు మొత్తాన్ని పెంచేందుకు యోచిస్తోంది. కడప నగరంలోని మట్టి పెద్దపులి వద్ద నిరుపయోగంగా ఉన్న గోదాముకు మరమ్మతులు చేయించి అద్దెకిచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. నగర నడి బొడ్డులో ఉన్న డీసీఎంఎస్ కార్యాలయానికి చెందిన ఖాళీ స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టి రెంట్‌కు ఇవ్వడం ద్వారా మరింత ఆదాయం పొందాలనే యోచనలో కమిటీ చైర్మన్ ఉన్నారు. సొసైటీ ఏర్పడినప్పటి నుంచి టీడీపీకి చెందిన వ్యక్తులు ఎవరూ సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించలేదు. ఇప్పుడు మాత్రమే టీడీపీకి చెందిన జయప్రకాశ్‌కు పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్‌గా అవకాశం ఇవ్వడంతో, నష్టాల్లో ఉన్న డీసీఎంఎస్‌ను లాభాల బాటలోకి తీసుకువచ్చి తమ సమర్థతను నిరూపించుకునేందుకు శ్రమిస్తున్నారు.

పాలకవర్గానికి సహకరిస్తాం



డీసీఎంఎస్ అభివృద్ధి కోసం పాలకవర్గానికి సహకరిస్తాం. సొసైటీ బాగుపడితే అటు రైతులకు కానీ, ఇటు సిబ్బందికి కానీ ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు కూడా డీసీఎంఎస్ వినిమయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా అధికారులు తమకు అవసరమైన స్టేషనరీ ఇతర పరికరాల సరఫరాకు మాకు అవకాశం కల్పించాలి.

- ఎస్.ఖాదర్‌వలి, బిజినెస్ మేనేజరు, డీసీఎంఎస్

'మెట్రో రైలు నిర్మాణ వ్యయం కేంద్రమే భరించాలి'

వేంపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ, విజయవాడల్లో మెట్రో రైలు నిర్మాణ వ్యయాన్ని కేంద్రమే భరించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. విభజన చట్టం ప్రకారం మెట్రో రైలు సౌకర్యాన్ని విభజన జరిగిన సంవత్సరం లోపు కేంద్ర నిధులతో కల్పించాల్సి ఉండగా 50:50 ప్రాతిపదికన కేంద్రం, రాష్ట్రం భరించేటట్లు టెండర్లు పిలవాలని గురువారం రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించడం శోచనీయమన్నారు. దీంతో రాష్ట్ర ఖజానాపై విపరీతమైన ఆర్థిక భారం పడుతుందన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి 49,485 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని, వెంటనే 80, 515 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.6400 కోట్లను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి రైతులో మార్పు రావాలి

లింగాల, జూలై 25 (ఆంధ్ర జ్యోతి): సాగు విధానంలో సమూల మార్పులు చేపట్టాల్సిన సమయం వచ్చిదని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని అక్కులగారిపల్లెలో ప్రకృతి వ్యవసాయం చేసే ఉదయ్‌కృష్ణారెడ్డి పొలంలో రైతు సేవ కేంద్రం సిబ్బందికి శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రైతులు విపరీతంగా రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగిస్తుండడంతో ఆహారం విషతుల్యం అవుతోందని, భూసారం తగ్గిపోయి, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు క్రమంగా ప్రకృతి వ్యవసాయం చేసేలా వారికి అవగాహన కల్పించాలని, ప్రస్తుత వ్యవసాయం విధానాల వలన కలిగే దుష్ప్రభావాలు, ప్రకృతి వ్యవసాయం వలన కలిగే ప్రయోజనాలను వివరించి వారిలో మార్పు కలిగేలా రైతు సేవా కేంద్రం సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల, వేముల ఏఓలు చెన్నారెడ్డి, ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

మీరు భయపెడితే భయపడతామా..

- నాకేమైనా జరిగితే మీ కుటుంబాలకు నిద్రలేని రాత్రులే..
- నారా లోకేశ్, బీటెక్ రవిపై వైసీపీ నేత సతీష్‌రెడ్డి ధ్వజం


విలేకరులతో మాట్లాడుతున్న సతీశ్ రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె,జూలై 25 (ఆంధ్రజ్యోతి): నీవు భయపెడితే భయపడతామా.. నాకేమైనా జరిగితే నీ కుటుంబానికి నిద్రలేని రాత్రులు ఉంటాయని మంత్రి లోకేశ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిపై వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం కడపలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను చంద్రబాబునాయుడు, లోకేశ్‌పై విమర్శలు చేశానని వారు చెప్పడమే కాకుండా, తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించడం శోచనీయమన్నారు. మీ నాయకుల కోసం తొందరపడి మాట్లాడొద్దని సూచించారు. మాట్లాడేటపుడు సంస్కారం తో మాట్లాడితే మంచిదని హితవుపలికారు. తనకు, శ్రీనివాస్‌రెడ్డి, బీటెక్ రవి మధ్య ఎటువంటి విభేదాలు లేవని, లోకేశ్ రెచ్చగొట్టడం వల్లే వారు ఇలా మాట్లాడుతున్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, మేయర్ సురేశ్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధి పొంది.. విమర్శించడం సిగ్గుచేటు!

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, భూపేశ్‌రెడ్డి


మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో పదవులు పొందిన సతీశ్ రెడ్డి , ప్రస్తుతం ఆయననే విమర్శించడం సిగ్గుచేటని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఆగస్టు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలనకు శుక్రవారం జమ్మలమడుగుకు వచ్చిన ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష నేతలు కొత్త బిక్షగాళ్ల పొద్దెరగరన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. 20 నుంచి 30 ఏళ్ల టీడీపీలో రాజకీయ లబ్ధిపొందిన తర్వాత వైసీపీలో చేరినవారు చేస్తున్న విమర్శలు పత్రికల్లో చూస్తున్నామన్నారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసి గట్టిగా బుద్ధి చెప్పినా ఇప్పటికి వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు ప్రజలు నమ్మడంలేదన్నారు. సంపద సృష్టికోసం రాష్ట్రానికి అనేక సంస్థలు రాబోతున్నాయన్నారు. ఈ సారి తామే అధికారంలోకి వస్తామని వైసీపీ నాయకులు చెబుతుండడంతో పారిశ్రామిక వేత్తలు భయపడుతున్నారన్నారు. సతీష్‌రెడ్డి వైసీపీ భజన చేయడం దారుణమన్నారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్ల అధికారంలో ఉండి, అన్ని రకాలుగా లబ్ధిపొందిన కడపజిల్లాలో పులివెందుల సతీష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఏం అభివృద్ధి చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక 300 నుంచి 400 మందికి సోలార్ విద్యుత్ సంస్థలో ఉద్యోగాలు ఇప్పించామన్నారు. జమ్మలమడుగులో రూ.25 కోట్లతో సీసీ రోడ్లు వేయించామన్నారు. 2019లో చంద్రబాబునాయుడు భూములు కోటాయించి మరీ సోలార్ ప్రాజెక్టులను తెస్తే.. వారిని బెదిరించారన్నారు. ఇద్దరూ టీడీపీలో లబ్ధిపొంది వైసీపీలో చేరి చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేస్తున్నారన్నారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆ ఇద్దరూ బాధితులే అన్నారు. అన్ని రకాలుగా ఇబ్బందులు పడి తిరిగి ఆయన కుమారుడు జగన్ చెంత చేరి రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబును విమర్శించడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. జమ్మలమడుగులో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ బోర్డు ఆర్జేడీగా సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌ఆర్జేడీగా సురేష్‌బాబును నియమిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా వృత్తి విద్య అధికారిగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబుకు కడప ఆర్జేడీ (ఎఫ్ఏసీ)గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. కడప ఆర్జేడీగా విధులు నిర్వహించిన శ్రీనివాసులు జూన్ 30న పదవీ విరమణ చేశారు. నేడో, రేపో సురేష్‌బాబు బాధ్యతలను స్వీకరించనున్నారు.

కేజీబీవీల్లో జీసీడీవో తనిఖీలు

కడప ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాపాడు, జమ్మలమడుగు, పెద్దముడియం కేజీబీవీలను జీసీడీఓ రూతు ఆరోగ్యమేరీ శుక్రవారం సందర్శించారు. డార్మెటరీ, మరుగుదొడ్లు, కిచెన్, స్టోర్ రూమ్, క్లాస్‌రూమ్‌లను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన కృత్యాలు, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఏంజెల్ ప్రణీత, నాగలక్షుమ్మ, మౌనిక, సిబ్బందికి తెలిపారు.

లైంగిక వేధింపుల కేసులో డీఎస్పీ విచారణ

దువ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగికంగా వేధించిన కేసులో మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. స్థానికులను, బాధితురాలిని కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఎస్ఐ వినోద్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం విరిగిపడి గొర్రెలు మృతి

మైదుకూరు రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి) విద్యుత్ స్తంభం విరిగిపడి ఆరు గొర్రెలు మృతి చెందినట్లు విద్యుత్ శాఖ ఏఈ వీరభద్రయ్య తెలిపారు. మైదుకూరు మండలంలోని సోమయాజులపల్లె గ్రామ పరిధిలో పెనుగాలులకు కరెంటు స్తంభం విరిగి పక్కనే అదే గ్రామానికి చెందిన సిద్దం రుక్మిణమ్మ అనే మహిళకు చెందిన గొర్రెలపై పడడంతో 6 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రమాదంతో తమకు సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయింది.

భరత్‌యాదవ్‌పై హత్యాయత్నం కేసు

పులివెందుల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తుపాకీతో పట్టపగలు ఓ వ్యక్తిని కాల్చిచంపిన భరత్‌యాదవ్ హతుడి తల్లిపైనా దాడి చేయడంతో హత్యాయత్నం కేసు నమోదైందని పులివెందుల సీఐ చాంద్ బాషా తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. 2023లో పులివెందుల నడిబొడ్డున బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన తుపాకీతో దిలీప్‌కుమార్ అనే వ్యక్తిని భరత్‌యాదవ్ కాల్చి చంపాడు. ఈ హత్య కేసు ప్రస్తుతం రాజీ చేసుకునేందుకు కొన్ని రోజులుగా భరత్‌యాదవ్ ప్రయత్నిస్తున్నాడు. గురువారం దిలీప్‌కుమార్ ఇంటివద్దకు పెద్ద మనుషులను పంపి రాజీ చేసుకునేందుకు ప్రయత్నించాడు. అందుకు దిలీప్‌కుమార్ తల్లి మస్తానమ్మ ఒప్పుకోలేదు. దీంతో శుక్రవారం ఉదయం 6.15గంటల ప్రాంతంలో భరత్‌యాదవ్ వారింటికి వెళ్లి ఈ కేసులో రాజీకి రాకుంటే చంపేస్తానంటూ మస్తానమ్మను బెదిరించాడు. రాజీకి మస్తానమ్మ ఒప్పుకోకపోవడంతో.. ఆమెను జుట్టుపట్టుకొని ఈడ్చి కొట్టాడు. దీనిపై మస్తానమ్మ పోలీసులను ఆశ్రయించడంతో భరత్‌యాదవ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శశిభూషణ్‌రెడ్డి

దువ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి వెల్లడించారు. దువ్వూరులో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్ శనివారం కడప పర్యటనకు వస్తున్నారని అన్నారు. బీజేపీ బలోపేతానికి మొదటగా రాయలసీమ జిల్లాలోని కడపను ఎంపిక చేసి పర్యటన చేపడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ, జాతీయ రహదారుల అభివృద్ధి, కడప-రేణిగుంట రైల్వే అభివృద్ధి, మైదుకూరు మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం, కడప విమానాశ్రయ అభివృద్ధి లాంటివాటికి నిధులు కేటాయించారని చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరికృష్ణ, ధార్మికసెల్ జిల్లా కన్వీనర్ బాస్కర్‌రెడ్డి, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, ప్రతాప్, పాల్గొన్నారు.

శిశువుల్లో జన్యు రుగ్మతలకు ఉచిత స్ర్కీనింగ్

కడప సెవెన్ రోడ్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జనన దశలో, గర్భధారణ సమయంలో శిశువుల్లో జన్యుపరమైన రుగ్మతలను నిర్ధారించేందుకు రిమ్స్‌లో ఉచిత స్ర్కీనింగ్ అందుబాటులోకి వచ్చిందని సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. భారత ప్రభుత్వ బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ), న్యూఢిల్లీ అందించే ఉమ్మీద్ అవుట్‌రీచ్ ప్రాజెక్ట్ కడప ప్రభుత్వ వైద్యశాలకు లభించిందన్నారు. మన రాష్ట్రంలో కడప జిల్లా మాత్రమే ఈ ప్రాజెక్టు కింద ఎంపికైందన్నారు. ఇది మూడు సంవత్సరాల పాటు నిధులందించే ప్రాజెక్టు అని ఇందులో 30,000 మంది గర్భిణిలకు హిమోగ్లోబినోపతీ కోసం, 15,000 నూతన శిశువులకు జన్యుపరమైన మెటబాలిక్ రుగ్మతల కోసం ఉచితంగా స్ర్కీనింగ్ చేస్తారన్నారు. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం జన్యు, మెటబాలిక్ రుత్మతలను తొందరగా గుర్తించి చికిత్స అందించడమని తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ సేవలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రియుడి మోసానికి యువతి బలి!


ప్రశాంతి (ఫైల్ ఫొటో)

కుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాకు చెందిన ఓ యువతి ప్రియుడి మోసానికి బలైపోయింది. ప్రియుడి ఇంటి ముందే శరీరం మీద పెట్రోలు పోసుకుని నిప్పటించుకుని తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. చిత్తూరు జిల్లా కుప్పంలో గురువారం రాత్రి పొద్దుపోయాక జరిగిన ఈ విషాదం సంచలనం సృష్టించింది. డీఎస్పీ పార్థసారథి కథనం మేరకు... కుప్పం మండలం మార్వాడ గ్రామానికి చెందిన వాసు గతంలో కడపలో నివాసముంటూ మైదుకూరులోని ఓ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేసేవాడు. అప్పటికే అతడికి స్వగ్రామంలో భార్య, ఒక కుమారుడు ఉన్నారు. అదే సమయంలో కడపకు చెందిన కేజీవీ ప్రశాంతి (24) ప్రొద్దుటూరులోని ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీ విభాగంలో పనిచేసేది. వీరిద్దరికీ పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. అయితే తనకు వివాహమైన విషయం వాసు దాచిపెట్టాడు. ఏడాదినుంచి తనను పెళ్లి చేసుకోవాల్సిందిగా వాసును ప్రశాంతి ఒత్తిడి చేయసాగింది. దీంతో వాసు చెప్పాపెట్టకుండా స్వగ్రామమైన మార్వాడకు వచ్చేశాడు. ఈ నేపథ్యంలో ఎలాగో వాసు చిరునామా తెలుసుకున్న ప్రశాంతి, ఈనెల 23న మార్వాడకు వచ్చి తనను పెళ్లి చేసుకోవాలంటూ అతడిపై ఒత్తిడి తెచ్చింది. వాసు కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ఆమె తల్లి అయిన మాలతిని కడపనుంచి పిలిపించి సర్దిచెప్పి తల్లితోపాటు పంపించేశారు. అయితే ప్రశాంతి గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో తిరిగి మార్వాడ చేరుకుంది. వాసు ఇంటి ఆవరణలోకి ప్రవేశించి ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పు పెట్టుకుంది. వెంటనే వాసుతోపాటు ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థుల సాయంతో మంటలను ఆర్పి ప్రశాంతిని కుప్పంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం ఆమెను పీఈఎస్ ఆసుపత్రికి, అక్కడినుంచి తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తీసుకువెళ్లి చేర్చారు.

అప్పటి నుంచి రుయాలో చికిత్స పొందుతూ ప్రశాంతి శుక్రవారం ఉదయం మృతి చెందింది. కాగా ఆమె మృతికి కారకుడైన వాసును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ప్రశాంతి తల్లి మాలతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య తెలిపారు.

సంక్షేమం కోసం పోరాడండి

విద్యుత్ చార్జీలు పెంచే స్మార్ట్ మీటర్లు వద్దు : మహాసభలో సీపీఐ నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

ములకలచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం, సమస్యలపై జరిగే పోరాటాల్లో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణప్ప, ఎం.సాంబశివ పిలుపు నిచ్చారు. ములకలచెరువులో మండల కార్యదర్శి అంజనప్ప అధ్యక్షతన సీపీఐ మండల 6వ మహాసభలో వారు మాట్లాడుతూ మిగులు భూములు, ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని పోరాటాలు చేస్తున్న సీపీఐ నేతలపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధించడాన్ని ప్రజలు నిరసించాలన్నారు. మండలంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. హంద్రీ - నీవా కాల్వ ద్వారా చెరువులన్నింటినీ నింపాలన్నారు. దళితులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై సీపీఐ చేసే పోరాటాల్లో ప్రజలందరూ పాల్గొనాలన్నారు. ఉచిత కరెంటును రద్దు చేసే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయరాదన్నారు. ములకలచెరువులో టమోటా ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. ములకలచెరువు నుంచి తంబళ్లపల్లెకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప, బషీర్‌ఖాన్, ఏఐటీయూసీ నేతలు తంబయ్యశెట్టి, వేణుగోపాల్ రెడ్డి, సలీంబాషా, షమీవుల్లా, నిజాముద్దీన్, వేమ నారాయణ, చంద్ర, మల్లికార్జున, హరికుమార్, చంద్రశేఖర్, జయకర్, రెడ్డెప్ప, అమరావతి, శంక రమ్మ, బాస్ నేత మంత్రాల రమణ, డీహెచ్‌పీ ఎస్ సత్యసాయి జిల్లా కార్యదర్శి అంజన్‌బాబు, సీపీఐ తలపుల మండల కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా జలాలను బాహుదాకు అనుసంధానం చేయాలి

నిమ్మనపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా జలాలను బాహుదాకు అనుసంధానం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండు సమీపంలో కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా జలాలను బా హుదాకు అనుసంధానం చేస్తే చెరువులు, కుంట లు నిండి సాగు,తాగునీటి సమస్యకు పరిష్కారం జరుగుతుందన్నారు. నిమ్మనపల్లి-కందూరు రోడ్డు మార్గం అత్యంత ప్రమాదకరంగా మారి రోజు వారీ తిరిగే వాహనదారులు, ప్రయాణీకులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఎన్నికల్లో నిమ్మనపల్లి-కందూరు రోడ్డు ఎజెండా చూపి ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతున్నారన్నారు. పాలకులు ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నేతలు మాధవరెడ్డి, నరేష్, శేఖర్, శ్రీరాములు, సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం, సంక్షేమమే ధ్యేయం


కోటవారుపల్లెలో పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం కోటవారుపల్లె, సందిరెడ్డిగారిపల్లెలో సుపరిపాలన-తొలిఅడుగులో ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ వివాదాలకు సంబంధించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా సరైన స్పందన లేదన్నారు. త్వరలోనే ఈ రెండు గ్రామాల్లో రెవెన్యూ అధికారులందరినీ పిలిపించి సదస్సులు నిర్వహిస్తామని, రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సందిరెడ్డిగారిపల్లె, మరో గ్రామాన్ని కలిపి 400 రేషన్ కార్డులకు ఒక చౌకదుకాణం మంజూరు చేస్తామన్నారు. సందిరెడ్డిగారిపల్లెలో ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ నేతలు నందకుమార్, సొక్కం వేణుగోపాల్ పాల్గొన్నారు.

ధర్నా చేసిన కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలి

విలేకర్లతో ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): మున్సి పల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన వైసీపీ కౌన్సిలర్లు, మహిళా నేతలపై పోలీసులు కేసు నమోదు చేయాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ డిమాండ్ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లిక్కర్ స్కామ్ నిందితుడు ఎంపీ మిధున్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా రెండు రోజుల కిందట వైసీపీ కౌన్సి లర్లు, మహిళా నాయకురాళ్లు మున్సిపల్ కార్యాలయం ప్రధాన ద్వారానికి అడ్డంగా నిలబడి ధర్నా చేశారన్నారు. నెల కిందట చైర్‌పర్సన్ చాంబర్‌లో వైసీపీ పోస్టర్లను ఆవిష్కరించారన్నారు. ప్రభుత్వ కార్యాల యాన్ని వైసీపీ కౌన్సిలర్లు తమ అడ్డాగా చేసుకుని వైసీపీ కార్యాలయంగా మార్చడం సిగ్గుచేటన్నారు.

విద్యార్థినులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

నిమ్మనపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముష్టూరు పంచాయతీలోని కస్తూర్బా పాఠశాలను ఎంపీడీఓ రమేష్‌తో కలసి తనిఖీ చేపట్టారు. ఆయన ముందుగా హాస్టల్ రికార్డులను, ఉపాధ్యాయులు హాజను పరిశీలించారు. అనంతరం హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతూ ముఖ్యంగా ప్రభుత్వం తల్లిదండ్రులు లేక బడి మానిన విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా కస్తూర్బా పాఠశాలలో హాస్టల్ ప్రవేశపెట్టి ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు, శుభ్రత వంటి వాటిని తనిఖీ చేసి పిల్లతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ మునివెంకటమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, ఎంఈఓ-2 నారాయణ పాల్గొన్నారు.

నేటీ నుంచి వృద్ధులకు ఇంటివద్దకే రేషన్

మదనపల్లె, జూలై 25(ఆంధ్రజ్యోతి): 65ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులకు శనివారం నుంచి ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయాలని సీఎస్ డీటీ ఎస్.ఫిరోజ్‌ఖాన్ పేర్కొన్నారు. గతనెల తరహాలోనే, జూలైలోనూ అదే ఒరవడితో పని చేయాలని సూచించారు. వృద్ధులు, వికలాంగులకు వందశాతం, పీడీఎస్ రేషన్ పంపిణీ 95శాతం పూర్తి చేసి జిల్లాలో మదనపల్లెను మొదటి స్థానంలో నిలిపారని, అదే ఒరవడితో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ పంపిణీ, పెండింగ్ ఈకేవైసీ కూడా పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. బినామీ డీలర్లను ప్రోత్సహించే అవకాశం లేదని, ఒకటి కంటే ఎక్కువ షాపులు నిర్వహిస్తున్న వారికి ఇక గడ్డుకాలమేనని హెచ్చరించారు. నిర్ణీత సమయంలో షాపులు తెరవాలని, పంపిణీ త్వరగా పూర్తి చేయాలని, ఇందులో ఎవరికీ మినహాయింపు లేదని సీఎస్ డీటీ తేల్చిచెప్పారు. సమావేశంలో రేషన్‌డీలర్ల సంఘం నేతలు ఎస్.మౌలాలి, ఇమామ్ ఖాసీం, సుధీర్‌బాబు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవారం దుర్గమ్మకు ప్రత్యేకపూజలు

రామసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి): బీసీ కాలనీ వద్ద వెలిసిన దుర్గమ్మకు శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. ఆలయ ప్రాంగణలో మామిడి, వేపాకులతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించారు.

వాల్మీకిపురం సింగిల్‌విండో అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి

● నేడు ప్రమాణ స్వీకారం



వాల్మీకిపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల సింగిల్‌విండో అధ్యక్షుడిగా టి.సాకిరేవుపల్లె వాసి ఆర్.కృష్ణారెడ్డి నియమితులయ్యారు. డైరెక్టర్లుగా చింతపర్తి గ్రామానికి చెందిన లంకిపల్లె మధు, వాల్మీకిపురం వాసి మొహిద్దీన్ ఆలీఖాన్ నియమితులయ్యారు. శనివారం మధ్యాహ్నం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతన కార్యవర్గం ప్రమాణం చేయనుంది. కూటమి నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నల్లారి అభిమానులు, హాజరై విజయవంతం చేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

వాల్మీకిపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై ఆర్‌ఎస్‌ఏ సిబ్బందికి ఏడీఏ నాగప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్‌ను పరిశీలిస్తూ వాటి ద్వారా వచ్చే లాభాలను తెలియజేశారు. ఘనజీవామృతం, విత్తన గులికలు, తయారు వ్యవసాయ పొలాల వద్ద చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, ఆర్‌ఎస్‌ఏ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ వితరణ

పీలేరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏబీసీ సంస్థ శుక్రవారం స్టేషనరీ వితరణగా అందజేసింది. ఆ సంస్థ తరపున ఆ సంస్థ అధ్యక్షురాలు సుమలత తండ్రి రాజేంద్ర ఆచారి ఎంఈఓ-2 పద్మావతమ్మ ద్వారా విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సొంత ఊరిపై మమకారంతో అమెరికాలో స్థిరపడిన ఏబీసీ సంస్థ అధ్యక్షురాలు సుమలత ఏటా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టేషనరీ వితరణగా అందించడం అభినందనీయమన్నారు. శివరామాపురం, దుబ్బా హరిజనవాడ, శెట్టిపల్లె హరిజనవాడ పాఠశాలల్లోనూ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేణుక, సీఆర్‌పీ శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

దిన్నెపల్లె కేజీబీవీ తనిఖీ


మధ్యాహ్న భోజనం మెనూ తనిఖీ చేస్తున్న స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ, తహసీల్దార్

రామసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి): దిన్నెపల్లె కేజీబీవీ పాఠశాలను మండల స్పెషలాఫీసర్ నాగరాజు ఎంపీడీఓ గఫూర్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంటగది శుభ్రతను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వండుతున్నారా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో స్పెషలాఫీసర్, ఎంపీడీఓ, తహసీల్దార్ మధ్యాహ్న భోజనం తిన్నారు. అనంతరం చెంబకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది సకాలంలో రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఆస్పత్రిలో రోగుల సౌకర్యాలపై ఆరా తీశారు. మినికి పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు.

పీలేరులో 2731 బంగారు కుటుంబాల గుర్తింపు

పీలేరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో 'పీ-4'(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) గ్రామ సభలు నిర్వహించి 2731 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం 'పీ-4' కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని తెలిపారు. అన్ని సచివాలయాల పరిధిలో గ్రామ సభలు నిర్వహించి నిరుపేద కుటుంబాలను గుర్తించామని చెప్పారు. అగ్రహారం 270, బాలంవారిపల్లె 114, బండ్లవంక 214, బోడుమల్లువారిపల్లె 118, దొడ్డిపల్లె 96, గూడరేవుపల్లె 149, కాకులారంపల్లె 262, కావలిపల్లె 179, ముడుపుల వేముల 209, నాగిరెడ్డికాలనీ 65, పీలేరు-1 179, రేగళ్లు 167, ఆర్టీసీ నల్లగుట్ట 336, తలపుల-1 73, తలపుల-2 90, వేపుల బైలు 210 బంగారు కుటుంబాలు గుర్తించారు. .

వెంకన్నకు మకరతోరణాలు బహూకరణ


టీటీడీ ఆలయ అధికారులకు మకరతోరణాలు వితరణ చేస్తున్న దాత

తంబళ్లపల్లె, జూలై 25(ఆంధ్రజ్యోతి): కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ, పద్మావతి అమ్మవార్లను కోసువారిపల్లెకు చెందిన దాత లక్ష్మీదేవమ్మ రెండు ఇత్తడి మకరతోరణాలను బహూకరించారు. శుక్రవారం దాత లక్ష్మీదేవమ్మ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు సుమారు రూ.95 వేలు విలువైన 13.5 కిలోలు బరువు ఉన్న రెండు ఇత్తడి మకర తోరణాలను టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, సిబ్బంది నగేష్‌కు అందచేశారు. ఆలయ అర్చకులు రమేష్ స్వామి మకరతోరణాలకు పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. దాతకు టీటీడీ అధికారులు స్వామి వారి ప్రత్యే క దర్శనం చేయించి తీర్థప్రసాదాలను అందచేశారు.

శివాలయంలో శ్రావణమాస ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

పెద్దతిప్పసముద్రం జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలతో అభిషేక పూజలు, శ్రీచక్రానికి అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మహిళలకు కుంకుమ, గాజులు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం నిర్వహించారు. ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని రోజూ పూజలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంకిరెడ్డిపల్లెలో కళాజాత

పెద్దతిప్పసముద్రం జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛ సంకల్ప ఆరోగ్య విషయాలపై రాజమండ్రి కళాబృందంచే కళాజాత నిర్వహించారు. శుక్రవారం అంకిరెడ్డిపల్లెలో ఆరోగ్య విషయాలపై కళాజాత నిర్వహించారు. గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లతో కలిగే ప్రయోజనాలు, తడి, పొడిచెత్తను వేరు చేయడం వలన పంచాయతీకి సమకూరే లాభాలు, వాటి ప్రయోజనాలు, ప్లాస్టిక్ నిషేధం, దోమల నివారణ, వ్యక్తిగత శుభ్రత, గురించి కళాబృందం వివరించింది. సర్పంచ్ భాగ్యమ్మ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పట్టణంలో ఫాగింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పీలేరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'దోమల జోరు - కానరాని ఫాగింగ్' అన్న శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. పంచాయతీ అధికారులు పట్టణంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి పట్టణంలో ఎక్కడికక్కడ మురుగు పేరుకు పోవడంతో దోమల బెడద అధికమైంది. స్పందించిన ఈఓ లతీఫ్‌ఖాన్ సూచనతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్ ఫాగింగ్ చేశారు.

కోర్టులో గంగమ్మకు పసుపుతో అలంకరణ



మదనపల్లె అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు శ్రావణ శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు పసుపుతో అలంకరించి విశేష పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయం చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకముందే ఆలయాన్ని వేపాకులు, పూలతో శోభాయామానంగా అలంకరించారు. రాహుకాలంలో మహిళలు పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు తీసుకొచ్చి అమ్మకు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం నిమ్మకాయలపై నెయ్యివత్తులతో దీపారాధన చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు జోలెపాలెం కరుణాకర్ నాయుడు, కార్యదర్శి మార్వూరి ప్రభాకర్ నాయుడు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సింగిల్ విండో చైర్మన్‌గా మూర్తిరావు

గుర్రంకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ సింగిల్ విండో చైర్మెన్‌గా ఎం.ఎల్.ఎన్.మూర్తిరావు నియమితులయ్యారు. ఇటీవల ప్రభుత్వం సింగిల్ విండో పాలక వర్గానికి త్రీమెన్ కమిటీని నియమించింది. ఇందులో భాగంగా పాలకవర్గ చైర్మెన్‌గా మూర్తిరావు, సభ్యులుగా సాలార్‌సాబ్, సత్యనారాయణరెడ్డి ఉన్నారు. ఈ నేపథ్యంలో శనివారం వీరు ప్రమాణం చేయనున్నారు.

'జనవాణి'లో పీలేరు జనసైనికులు


జనవాణి కార్యక్రమంలో పాల్గొన్న పీలేరు జనసేన నేతలు

పీలేరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని తమ పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన జనవాణి కార్యక్రమంలో పీలేరు జనసైనికులు పాల్గొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కలప రవి, పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బెజవాడ దినేశ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారు మాట్లాడుతూ కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి మరికొన్నింటిని వివిధ శాఖల అధికారులకు పంపించామని వారు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరినారాయణ, తహసీల్దార్ ప్రదీప్

ములకలచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రోగులు, జ్వరపీడుతులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని ఎంపీడీఓ హరినారాయణ, తహసీల్దార్ ప్రదీప్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మందుల గదిని తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తనిఖీ నివేదికలను కలెక్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

మదనపల్లెకు 25 ఐరిష్ మిషన్లు

మదనపల్లె అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా తెల్లరేషన్ కార్డుల ఈకేవైసీ చేసేందుకు మదనపల్లెకు 25 ఐరిష్ మిషన్లు పంపిణీ చేసినట్లు సీఎస్‌డీటీ ఫిరోజ్ తెలిపారు. మొత్తం 101 రేషన్ దుకాణాలు ఉండగా అందులో 25 మాత్రమే అందించామన్నారు. వీటితో త్వరితగతిన ఈకేవైసీ పూర్తి చేయాలని డీలర్లకు సూచించారు. మదనపల్లె డీలర్స్ అసోసియేషన్ నేతలు, డీలర్లు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

తంబళ్లపల్లె, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వయం సహాయక సంఘాలు, మండల, గ్రామ సమాఖ్య సభ్యులు రికార్డులు సక్రమంగా నిర్వహించుకున్నపుడే లెక్కలు పారదర్శకంగా ఉంటాయని ఏపీఎం గంగాధర్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆడిటర్లు విజయ్‌కాంత్, గిరికుమార్ 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండల సమాఖ్య, ఎస్‌బీఓ, 32 గ్రామ సమాఖ్యలకు జరిగిన బ్యాంకు లావాదేవీలపై ఆడిట్ నిర్వహించారు. పొదుపు, స్త్రీ నిధి రుణాలు, బ్యాంకు లింకేజీ రుణాలు, చెల్లింపులు తదితర అంశాలపై తనిఖీ చేశారు. ఆడిట్ నివేదికలను త్వరలో వెల్లడిస్తామని ఏపీఎం తెలిపారు. డీఎంజీ మల్లయ్య, సీసీలు, సంఘమిత్రలు, వీఓ సభ్యులు పాల్గొన్నారు.